CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 53 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప గురువారం 30 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 53 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA THU 30 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





- మొంథా తుపాను బాధితులకు ఏపీ ప్రభుత్వం ఆర్థిక సాయం
- పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి తొలి దశలో సాయం
- ప్రతి వ్యక్తికి రూ.1000, కుటుంబానికి గరిష్ఠంగా రూ.3000
- ఇళ్లకు వెళ్లే ముందు బాధితులకు నేరుగా నగదు అందజేత
- విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ
- గత వారం కోస్తాంధ్రను అతలాకుతలం చేసిన మొంథా తుపాను

# ఏపీలో మొంథా తుపాను బీభత్సం

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటన..

## మొంథా బీభత్సంపై సీఎం చంద్రబాబు సమీక్ష... మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు

- తుపాను బాధితులకు తక్షణ సాయం.. సమీక్షలో సీఎం కీలక ఆదేశాలు
- భారీ పంట నష్టం.. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్న చంద్రబాబు
- విద్యుత్, రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు
- తుపాను మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం
- పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న సీఎం

- ఏపీ తీరాన్ని దాటిన తీవ్ర తుపాను మొంథా, పలు జిల్లాల్లో విధ్వంసం
- గాలుల బీభత్సానికి ఇద్దరు మృతి, భారీగా ఆస్తి, పంట నష్టం
- కోనసీమలో 20 వేల ఎకరాల్లో వరి పంట ధ్వంసమైనట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే, సమీక్ష
- పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆర్థిక సాయం, నిత్యావసరాల పంపిణీ
- సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

వివరాలు 2లో..

# యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి



**పెన్ పవర్ డెస్క్:** మొంథా తుపాను ప్రభావంతో విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని ఏపీ డిప్యూటీ సీం పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మొంథా ప్రభావంపై క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెలుసుకున్నారు.

వివరాలు 2లో..

# లొంగిపోయిన 21 మంది మావోలు... రెడ్ కార్పెట్ స్వాగతం పలికిన అధికారులు

- ఛత్తీస్‌గఢ్‌లో పోలీసుల ఎదుట 21 మంది మావోయిస్టుల లొంగుబాటు
- వీరిలో 13 మంది మహిళలు, 8 మంది పురుషులు
- ఏకే-47 సహా 18 అత్యాధునిక ఆయుధాలు అప్పగింత
- ఎన్‌కౌంటర్లకు బదులు లొంగుబాటుకే ప్రభుత్వ ప్రాధాన్యం
- మావోయిస్టు అగ్రనాయకత్వం కుదేలు అయిందన్న బస్తర్ ఐజీ

వివరాలు 2లో..




# ఢిల్లీలో స్వేచ్ఛగా జీవిస్తున్నాను కానీ, ఆ దాడుల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాను

- తన కుటుంబంపై హింసాత్మక దాడులు జరిగాయన్న షేక్ హసీనా
- వచ్చే బంగ్లాదేశ్ ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టీకరణ
- బంగ్లాదేశ్‌లో రాజ్యాంగ బద్ధ పాలన రావాలంటే తమ పార్టీ అధికారంలోకి రావాలన్న హసీనా

**పెన్ పవర్ డెస్క్:** ఢిల్లీలో తాను స్వేచ్ఛగా జీవిస్తున్నానని, అయితే కుటుం బంపై జరిగిన హింసాత్మక దాడుల నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నానని


వివరాలు 2లో..



## వాతావరణ మార్పులతో పెను ముప్పు..

# ఏటా లక్షల మంది బలి..

## లాన్సెట్ నివేదికలో సంచలన విషయాలు!



- లాన్సెట్ నివేదికలో వాతావరణ మార్పులపై షాకింగ్ నిజాలు
- 1990ల నుంచి 63 శాతం పెరిగిన వడదెబ్బ మరణాలు
- వాతావరణ మార్పు ఓ ఆరోగ్య సంక్షోభమన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ
- ప్రపంచవ్యాప్తంగా వరదలు, కరవు, అంటువ్యాధుల విజృంభణ
- శిలాజ ఇంధన సబ్సిడీలపై ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు

**పెన్ పవర్ డెస్క్:** వాతావరణ మార్పుల ప్రభావంపై ప్రఖ్యాత 'లాన్సెట్ కౌంట్ డౌన్' విడుదల చేసిన నివేదిక యావత్ ప్రపంచాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వాతావరణ మార్పుల విషయంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల ఏటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈరోజు విడుదలైన ఈ నివేదిక ప్రకారం 1990లతో పోలిస్తే అధిక వేడి సంబంధిత మరణాలు 63 శాతం పెరిగాయి. 2012-21 మధ్య కాలంలో ఏటా సగటున 5,46,000 మంది వడదెబ్బ వంటి కారణాలతో మరణించినట్లు తేలింది. ప్రపంచవ్యాప్తంగా 128 మంది నిపుణులు కలిసి ఈ నివేదికను రూపొందించారు.

వివరాలు 2లో..

# ఓట్లు వేస్తామంటే మోదీ డ్యాన్స్ కూడా చేస్తారు

- ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ రాహుల్ గాంధీ
- ఓట్ల కోసం మోదీ ఏమైనా చేస్తారని విమర్శ
- ఛఠ్ పూజ సమయంలో మోదీ స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేశారని ఆరోపణ
- పారిశ్రామికవేత్తల కోసమే మోదీ పనిచేస్తున్నారని ఫైర్
- దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని హామీ
- బీహార్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని కూల్చాలని పిలుపు




వివరాలు 2లో..

# మోదీ మంచివాడే... కానీ కఠినమైన వ్యక్తి

- దక్షిణ కొరియాలో ట్రంప్ పర్యటన
- భారత్-పాక్ అంశంపై స్పందన
- ప్రధాని మోదీ గురించి ప్రస్తావన

**పెన్ పవర్ డెస్క్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ చూడటానికి ఎంతో మంచి వ్యక్తిలా కనిపిస్తారని, కానీ ఆయన చాలా కఠినమైన వ్యక్తి అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. బుధవారం తన ఆసియా పర్యటనలో భాగంగా దక్షిణ కొరియాలో మాట్లాడిన ఆయన, భారత్‌తో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై త్వరలోనే

వివరాలు 2లో..



# రఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము...

## అంబాలా ఎయిర్‌బేస్‌లో గగన విహారం



- హర్యానాలోని అంబాలా ఎయిర్‌బేస్‌లో ప్రత్యేక సార్టీ
- పైలట్ యూనిఫాంలో గగన విహారం చేసిన భారత ప్రథమ పౌరురాలు
- వాయుసేన సామర్థ్యాలపై విశ్వాసాన్ని చాటిన రాష్ట్రపతి
- 'ఆపరేషన్ సిందూర్'లో రఫేల్ జెట్ల కీలక పాత్ర
- గతంలో సుఖోయ్-30 విమానంలోనూ ప్రయాణించిన ముర్ము

**పెన్ పవర్ డెస్క్:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. హర్యానాలోని అంబాలా వాయుసేన స్థావరం నుంచి ఆమె ఈ ప్రత్యేక సార్టీలో పాల్గొన్నారు. ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా

వివరాలు 2లో..

# మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలి



- మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి లోకేశ్ సమీక్ష
- తుపాను సహాయక చర్యలపై దృష్టిసారించిన మంత్రి
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం
- విద్యుత్ పునరుద్ధరణ, పంట నష్టం అంచనాపై ప్రత్యేక దృష్టి
- ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచన
- దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్న ఆదేశాలు
- బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలని దిశానిర్దేశం

**పెన్ పవర్ డెస్క్:** మొంథా తుపాను తీరం దాటిన నేపథ్యంలో, ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. తుపాను అనంతర పరిస్థితులపై విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో హోంమంత్రి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆర్టీజీఎస్ సెక్రటరీ కాటంనేని భాస్కర్ పాల్గొన్నారు. తుపాను నష్టం, సహాయక చర్యలపై లోకేశ్ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "రాబోయే 48 గంటల పాటు అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని గృహాలు, వాణిజ్య సముదాయాలకు వందశాతం విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలి. భారీ వర్షాల కారణంగా రహదారులపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించేందుకు అగ్నిమాపక శాఖ చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు.పంట నష్టం అంచనాలను వెంటనే రూపొందించాలని, దెబ్బతిన్న పంటలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని లోకేశ్ సూచించారు. మొంథా తీవ్ర తుపాను కారణంగా సంభవించిన ప్రాణ నష్టం, దెబ్బతిన్న నిర్మాణాలపై పూర్తి నివేదిక అందించాలని కోరారు. వర్షాల ధాటికి దెబ్బతిన్న వంతెనలు, కల్వర్టులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. చెరువులు, కుంటలు, కాలువ గట్లను పటిష్టపరిచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. "అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పాముకాటుకు ఉపయోగించే యాంటీ వీనం ఔషధాలను అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలి. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తుపాను బాధితులు, మత్స్యకారులకు అవసరమైన నిత్యావసర సరకులను వెంటనే పంపిణీ చేయాలి" అని లోకేశ్ అధికారులను ఆదేశించారు.

### వాతావరణ మార్పులతో పెను ముప్పు..

# ఏటా లక్షల మంది బలి..

- మొదటి పేజీ తరువాయి

వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న వరదలు, కరవు, కార్చిచ్చులు, అంటువ్యాధుల వ్యాప్తి వంటి తీవ్ర పరిణామాలను ఇది కళ్లకు కట్టింది. మానవ తప్పిదాల వల్ల పెరుగుతున్న గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలే ఈ దుస్థితికి కారణమని నివేదిక తేల్చిచెప్పింది. బ్రెజిల్‌లో నవంబర్‌లో జరగనున్న కాప్ 30 (%జుౖా% 30) సదస్సుకు ముందు ఈ నివేదిక రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఆరోగ్య సంక్షోభమే: డబ్ల్యూహెచ్‌ఓ**

ఈ నివేదికపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (%ఔనూ%) స్పందించింది. "వాతావరణ సంక్షోభం అంటే ఆరోగ్య సంక్షోభమే. ఉష్ణోగ్రతల్లో పెరిగే ప్రతీ డిగ్రీ ప్రజల ప్రాణాలను, జీవనోపాధిని బలి తీసుకుంటోంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే, వాతావరణ మార్పులను ఎదుర్కొనే చర్యలే మన ఆరోగ్యానికి గొప్ప అవకాశం. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన ఆహారం, పటిష్ఠమైన ఆరోగ్య వ్యవస్థలతో మనం లక్షలాది ప్రాణాలను కాపాడుకోవచ్చు" అని డబ్ల్యూహెచ్‌ఓ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జెరెమీ ఫర్రార్ తెలిపారు.

**నివేదికలోని కీలక అంశాలు:**

2024లో సగటు ఉష్ణోగ్రతలు పారిశ్రామిక యుగం నాటి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదయ్యాయి.

2024లో ఒక సగటు వ్యక్తి 16 రోజుల పాటు ప్రమాదకరమైన వేడిని ఎదుర్కొన్నాడు. శిశువులు, వృద్ధులు 20 రోజులకు పైగా వడగాలులకు గురయ్యారు.

అధిక వేడి కారణంగా 2024లో ఏకంగా 640 బిలియన్ల పని గంటలు వృథా అయ్యాయని, దీనివల్ల 1.09 ట్రిలియన్ డాలర్ల ఉత్పాదకత నష్టం వాటిల్లిందని నివేదిక పేర్కొంది.

2024లో ప్రపంచంలోని 61 శాతం భూభాగం తీవ్ర కరువు బారిన పడింది. ఇది 1950ల సగటు కంటే 299 శాతం అధికం.

కార్చిచ్చుల వల్ల వెలువడిన కాలుష్యంతో 2024లో రికార్డు స్థాయిలో 1,54,000 మంది మరణించారు.

డెంగ్యూ వంటి అంటువ్యాధుల వ్యాప్తి గణనీయంగా పెరిగింది.

**శిలాజ ఇంధనాలపై ప్రేమ.. ఆరోగ్య వ్యవస్థలపై నిర్లక్ష్యం**

ఓవైపు వాతావరణ మార్పులతో ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే, మరోవైపు ప్రభుత్వాలు శిలాజ ఇంధనాలకు భారీగా సబ్సిడీలు ఇస్తున్నాయని నివేదిక తీవ్రంగా విమర్శించింది. 2023లో ప్రభుత్వాలు 956 బిలియన్ డాలర్లను శిలాజ ఇంధన సబ్సిడీలకే ఖర్చు చేశాయి. 15 దేశాలైతే తమ మొత్తం ఆరోగ్య బడ్జెట్ కంటే ఎక్కువగా ఈ సబ్సిడీలకే కేటాయించడం ఆందోళన కలిగించే విషయం. "శిలాజ ఇంధనాల వాడకాన్ని వేగంగా తగ్గించి, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లడమే తక్షణ కర్తవ్యం. దీనివల్ల కాలుష్యం, గ్రీన్‌హౌస్ వాయువులు తగ్గి ఏటా కోటి మంది ప్రాణాలను కాపాడవచ్చు" అని లాన్సెట్ కౌంట్‌డౌన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మెరీనా రోమనెల్లో సూచించారు.

## ఢిల్లీలో స్వేచ్ఛగా జీవిస్తున్నాను కానీ, ఆ దాడుల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాను

- మొదటి పేజీ తరువాయి

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తెలిపారు. ఆ దేశంలో విద్యార్థుల ఆందోళనల కారణంగా ప్రధాని పదవి నుంచి దిగిపోయిన షేక్ హసీనా అనంతరం భారత్‌కు వచ్చారు. గత సంవత్సరం ఆగస్టు 5 నుంచి ఆమె ఢిల్లీలో నివసిస్తున్నారు. అప్పటి నుంచి పలుమార్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన ఆమె, బుధవారం మొదటిసారి మీడియా ముందుకు వచ్చారు.వచ్చే ఏడాది బంగ్లాదేశ్‌లో జరగనున్న జాతీయ ఎన్నికల్లో పోటీ చేస్తానని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ పోటీ చేయకపోతే తమకు ఉన్న లక్షలాది మంది మద్దతుదారులు ఎన్నికలను బహిష్కరిస్తారని అన్నారు. భవిష్యత్తులో బంగ్లాదేశ్‌లో అధికారం చేపట్టడానికైనా లేదా ప్రతిపక్ష పాత్ర పోషించడానికైనా తమ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. బంగ్లాదేశ్‌లో రాజ్యాంగ పాలన, రాజకీయ స్థిరత్వం నెలకొనాలంటే తిరిగి తమ పార్టీ అధికారంలోకి రావాలని ఆమె అభిప్రాయపడ్డారు.దేశ భవిష్యత్తును ఏ ఒక్క కుటుంబం లేదా ఒక వ్యక్తి నిర్వహించాలని తాను భావించడం లేదని షేక్ హసీనా అన్నారు. తాను దేశం విడిచి వచ్చిన తరువాత తమ పార్టీ నేతలపై దాడులు చేయడం, తమ పార్టీపై నిషేధం విధించడం ద్వారా అక్కడి తాత్కాలిక ప్రభుత్వం తమ ఓటమిని అంగీకరించిందని అన్నారు. ఎన్నికల తర్వాత అధికారం చేపట్టే ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ఎన్నికవ్వాలని ఆమె ఆకాంక్షించారు.యూనస్ ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను షేక్ హసీనా ఖండించారు. తనను రాజకీయంగా బలహీనపరచడానికి ఆ ఆరోపణలు చేశారని తెలిపారు. తనపై అభియోగాలు నమోదు చేసే ముందు బంగ్లాదేశ్‌లోని కోర్టులు తనకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదని, తన వాదనలు వినిపించడానికి కూడా అవకాశమివ్వలేదని ఆమె అన్నారు.

# ఏపీలో మొంథా తుపాను బీభత్సం...

మొంథా తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసింది. బుధవారం తెల్లవారుజామున రాష్ట్ర తీరాన్ని దాటిన ఈ తుఫాను పెను విధ్వంసం సృష్టించింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, వేలాది ఇళ్లు, పంటలు, విద్యుత్ టవర్లు దెబ్బతిన్నాయి. తుపాను ధాటికి జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.

భారీ గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కుండపోత వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కోస్తా జిల్లాల్లోని అనేక గ్రామాలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లపైకి వరద నీరు చేరడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి, నేలకొరిగిన చెట్లను, స్తంభాలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.కాకినాడ, మచిలీపట్నం మధ్య నర్సాపురం సమీపంలో మొంథా తుపాను తీరాన్ని దాటినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఆ తర్వాత క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా, ఆపై వాయుగుండంగా మారింది. ఇది వాయవ్య దిశగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనించి రాబోయే ఆరు గంటల్లో అల్పపీడనంగా బలహీనపడనుందని అధికారులు వెల్లడించారు.

**జిల్లాల్లో తీవ్ర నష్టం**

ఈ తుపాను కారణంగా కోస్తా జిల్లాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్క కోనసీమ జిల్లాలోనే 20 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని వ్యవసాయ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. బాపట్ల జిల్లాలో ఓ పుణ్యక్షేత్రం వద్ద వరద నీటిలో చిక్కుకున్న 20 మందిని పోలీసులు సురక్షితంగా కాపాడారు.

పల్నాడు జిల్లా తిమ్మాపురం వద్ద కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి (NH-16)పైకి వరద నీరు చేరడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కొండచరియలు విరిగిపడటంతో శ్రీశైలం ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. ప్రకాశం జిల్లా వెలిగొండ ప్రాజెక్టులోని రెండు టన్నెళ్లలోకి వరద నీరు చేరడంతో, అక్కడ పనిచేస్తున్న 200 మంది సిబ్బందిని సురక్షితంగా బయటకు తరలించారు. నంద్యాల జిల్లాలో కుందూ నది, మద్దిలేరు, చామ కాల్వ వాగులు పొంగిపొర్లుతున్నాయి.

**ప్రభుత్వ సహాయక చర్యలు, సీఎం పర్యటన**

ముఖ్యమంత్రి చంద్రబాబు కోనసీమ జిల్లాలోని ఉడెలరేవులో పర్యటించి, తుపాను నష్టాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అంతకుముందు మంత్రులు, జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, సహాయక చర్యలపై కీలక సూచనలు చేశారు. గత నాలుగు, ఐదు రోజులుగా సమర్థంగా చర్యలు తీసుకోవడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని ఆయన పేర్కొన్నారు.మరోవైపు, ప్రభుత్వం బాధితులను ఆదుకునేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం అందించనుంది. ఒక కుటుంబంలో ముగ్గురి కంటే ఎక్కువ సభ్యులుంటే గరిష్ఠంగా రూ.3,000 అందిస్తారు. మొత్తం 75,000 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. వీరితో పాటు మత్స్యకారుల కుటుంబాలకు 25 కిలోల బియ్యం (చేనేత, మత్స్యకారులకు 50 కిలోలు), కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, చక్కెరను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**మొంథా బీభత్సంపై సీఎం చంద్రబాబు సమీక్ష... మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు**

మొంథా తుపాను సృష్టించిన బీభత్సం నుంచి ప్రజలను, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. పంట నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలతో ఐదు రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వేగంగా నష్టాన్ని అంచనా వేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, తుపాను కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. బుధవారం ఉదయం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్న ముఖ్యమంత్రి, సాయంత్రం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రంలో ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయక, పునరుద్ధరణ చర్యలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**భారీగా పంట నష్టం.. ప్రాథమిక అంచనాలు వెల్లడి**

సమావేశంలో అధికారులు తుపాను వల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో సుమారు 87 వేల హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు. ఇందులో 59 వేల హెక్టార్లకు పైగా వరి పంట నీట మునిగిందని, ప్రత్తి, మొక్కజొన్న, మినుము వంటి ఇతర పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 78,796 మంది రైతులు నష్టపోయారని, 42 పశువులు కూడా మృత్యువాత పడ్డాయని వివరించారు. అయితే ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమేనని, క్షేత్రస్థాయిలో వాస్తవ నష్టం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, వ్యవసాయ శాస్త్రవేత్తలు వెంటనే దెబ్బతిన్న పొలాలను సందర్శించి, పంటలను కాపాడుకునే మార్గాలపై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని నిర్దేశించారు.

**విద్యుత్, రవాణా పునరుద్ధరణే లక్ష్యం**

సహాయక చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్న చంద్రబాబు, విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. బుధవారం రాత్రికి అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, గురువారం నాటికి దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు పూర్తి చేయాలని గడువు విధించారు. ఈ పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసులను యథావిధిగా కొనసాగించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ.. కూలిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామని, ఫీడర్లను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు.

**ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి.. కలెక్టర్‌పై అసహనం**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, ఎక్కడా నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను శుభ్రపరచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న ప్రతి కుటుంబానికి గురువారం నాటికల్లా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయాలని స్పష్టం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా రూరల్ వాటర్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఒంగోలు పట్టణంలోని పలు కాలనీలు నీట మునగడంపై ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు పనితీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పాలనా వైఫల్యాలు పునరావృతం కావొద్దని, విపత్తుల నిర్వహణలో పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ప్రతి జిల్లా ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు.

**భారీ ఎత్తున సహాయక చర్యలు**

మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని 249 మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లోని దాదాపు 18 లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారు. ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా 1,209 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, 1.16 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను కారణంగా రాష్ట్రంలో 380 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రహదారులు, 14 వంతెనలు, కల్వర్టులు దెబ్బతినడంతో రూ. 4.86 కోట్ల నష్టం వాటిల్లింది. అలాగే 2,294 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 1,424 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి రూ. 36 కోట్లు, జలవనరుల శాఖకు రూ. 16.45 కోట్ల నష్టం జరిగింది. సహాయక చర్యల్లో భాగంగా 3,175 మంది గర్భిణీలను ఆసుపత్రులకు తరలించగా, 2,130 వైద్య శిబిరాలు నిర్వహించారు. రహదారులపై విరిగిపడిన 380 చెట్లను తొలగించి రవాణాకు అంతరాయం లేకుండా చేశారు. తుపాను తీరం దాటడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, ప్రభుత్వ చర్యలపై ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన 21 మంది మావోలు... రెడ్ కార్పెట్ స్వాగతం పలికిన అధికారులు

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక కార్యాచరణలో భద్రతా బలగాలకు భారీ విజయం లభించింది. ఉత్తర బస్తర్ ప్రాంతంలో బుధవారం 21 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో 13 మంది మహిళలు, 8 మంది పురుషులు ఉన్నారు. తమ వెంట తెచ్చిన ఏకే-47, ఇన్సాస్, ఎస్ఎల్ఆర్ వంటి 18 అత్యాధునిక ఆయుధాలను వారు పోలీసులకు అప్పగించారు.జంగిల్‌వార్ కాలేజీలో జరిగిన ఈ లొంగుబాటు కార్యక్రమాన్ని అధికారులు ప్రత్యేకంగా నిర్వహించారు. జనజీవన స్రవంతిలోకి వస్తున్న మావోయిస్టులకు రెడ్ కార్పెట్ పరిచి స్వాగతం పలికారు. పునరావాసం కల్పించి తిరిగి సమాజంలోకి ఆహ్వానించాలనే ప్రభుత్వ కొత్త వ్యూహానికి ఇది అద్దం పడుతోంది. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ స్వయంగా లొంగిపోయిన వారికి రాజ్యాంగ ప్రతులను బహూకరించి, ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వారిని ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఐజీ సుందర్‌రాజ్ మాట్లాడుతూ, "ఈరోజు ఉత్తర బస్తర్ ప్రాంతానికి చెందిన 21 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వారిని సమాజంలోని అన్ని వర్గాల తరఫున మేము స్వాగతిస్తున్నాం. ఇంకా మిగిలి ఉన్న మావోయిస్టులు కూడా హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరాలని విజ్ఞప్తి చేస్తున్నాం. లొంగిపోయిన వారికి ప్రభుత్వ పాలసీ ప్రకారం రక్షణ కల్పిస్తాం. ఒకవేళ ఆయుధాలు వదిలిపెట్టకపోతే, భద్రతా బలగాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని స్పష్టం చేశారు.

ఈ నెలలో ఎన్‌కౌంటర్లకు బదులుగా లొంగుబాట్లను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ వ్యూహం సత్ఫలితాలనిస్తోంది. హింసను వీడేవారికి అండగా ఉంటామని, ప్రతిఘటించే వారిపై కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టమైన సందేశం పంపుతోంది. ఈ నెల ప్రారంభంలోనే జగదల్‌పూర్‌లో 208 మంది మావోయిస్టులు 109 ఆయుధాలతో లొంగిపోయిన విషయం

తెలిసిందే.మావోయిస్టు అగ్రనాయకత్వం కూడా తీవ్రంగా బలహీనపడిందని ఐజీ సుందర్‌రాజ్ వివరించారు. "ఒకప్పుడు మావోయిస్టు పొలిట్‌బ్యూరో, సెంట్రల్ కమిటీలో 45 మంది సభ్యులు ఉండేవారు. 2025 ప్రారంభానికి ఆ సంఖ్య 18కి పడిపోయింది. ప్రస్తుతం కేవలం 6 నుంచి 7 మంది మాత్రమే మిగిలి దక్షిణ బస్తర్ అడవుల్లో దాక్కున్నారు" అని ఆయన తెలిపారు. లొంగిపోవడానికి ఇంకా సమయం ఉందని, లేదంటే డీఆర్‌జీ వంటి భద్రతా బలగాలు ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించారు.

# ఓట్లు వేస్తామంటే మోదీ డ్యాన్స్ కూడా చేస్తారు

బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రచార వేగాన్ని పెంచారు. బుధవారం నాడు ముజఫర్‌పూర్‌లోని సక్రా నియోజకవర్గంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీకి ప్రజల బాధల కన్నా ఓట్లే ముఖ్యమని ఆయన ఆరోపించారు.వర్షంలోనూ ప్రసంగాన్ని కొనసాగించిన రాహుల్ గాంధీ, "నరేంద్ర మోదీకి ఓట్లు తప్ప మరేదీ పట్టదు. మీరు ఓటు వేస్తామని చెప్పండి, ఆయన వేదికపై డ్యాన్స్ చేయమన్నా చేస్తారు. ఓట్లు పొందడానికి ఆయన ఏదైనా చేయగలరు" అని ఎద్దేవా చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రధాని మోదీ మతపరమైన మనోభావాలను వాడుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. "ఛఠ్ పూజ సమయంలో ప్రజలు యమునా నదిలో స్నానాలు చేస్తూ పూజలు చేస్తుంటే, మోదీ మాత్రం తన కోసం ప్రత్యేకంగా నిర్మించుకున్న స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేశారు. దీన్నిబట్టి బీహార్ ప్రజల విశ్వాసాలతో ఆయనకు సంబంధం లేదని, కేవలం మీ ఓట్లు మాత్రమే కావాలని స్పష్టమవుతోంది" అని విమర్శించారు.ప్రధాని మోదీ పేదల కోసం కాకుండా పారిశ్రామికవేత్తల కోసమే పనిచేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. "ఎన్నికల తర్వాత నరేంద్ర మోదీ రైతులు లేదా పేదలతో కనిపించరు. ఆయన చిన్న పరిశ్రమలను నాశనం చేసి, కేవలం పారిశ్రామికవేత్తలకే లబ్ధి చేకూరుస్తున్నారు. మా కల 'మేడ్ ఇన్ చైనా' కాదు, 'మేడ్ ఇన్ బీహార్' వస్తువులను చూడటం" అని అన్నారు.ఈ సభలో రాహుల్ గాంధీతో పాటు మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్, వికాశ్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) అధినేత ముఖేశ్ సహానీ కూడా పాల్గొన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాలను మోసం చేసిన ఎన్డీయే 'డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని' కూకటివేళ్లతో పెకలించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బీహార్‌లో విద్య, ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయని రాహుల్ అన్నారు. "బీహార్‌లో విద్యకు అర్థం లేకుండా పోయింది. పేపర్ లీక్‌లు కష్టపడి చదివిన యువత భవిష్యత్తును నాశనం చేశాయి. బీహారీలు అప్పులు చేసి విద్య, ఉద్యోగాల

కోసం వలస వెళ్లాల్సి వస్తోంది. ఢిల్లీలోని ఎయిమ్స్ ఫ్లైఓవర్ కింద వారు బతుకు పోరాటం చేయడం మనం చూడవచ్చు," అని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు."మేం కులగణన డిమాండ్ చేశాం, కానీ మోదీ, బీజేపీ మౌనంగా ఉన్నాయి. వారు సామాజిక న్యాయానికి వ్యతిరేకం. నితీశ్ కుమార్ పూర్తిగా బీజేపీ నియంత్రణలో ఉన్నారు. ఈ ప్రభుత్వాన్ని మార్చాల్సిన సమయం వచ్చింది. మేం ప్రతి కులానికి, ప్రతి మతానికి ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. ఐదేళ్లలో బిహార్‌లో దేశంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం" అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

## రఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము...

- మొదటి పేజీ తరువాయి

భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర పోషించిన రఫేల్ జెట్‌లో రాష్ట్రపతి ప్రయాణించడం ప్రాధాన్యత సంతరించుకు ంది. భారత వాయుసేన కు చెందిన యుద్ధ విమానంలో ఆమె ప్రయాణించడం ఇది రెండోసారి.ఈ సార్టీకి ముందు రాష్ట్రపతి ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్ యూనిఫాం, హెల్మెట్ ధరించి విమానం ఎక్కేందుకు సిద్ధమయ్యారు. విమానం టేకాఫ్ అయ్యే ముందు ఆమె అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏ.పి. సింగ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. త్రివిధ దళాల సర్వ సైన్యాధ్యక్షురాలిగా ఉన్న ద్రౌపది ముర్ము, గతంలో 2023 ఏప్రిల్ 8న అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో సుఖోయ్-30 ఎంకెఐ యుద్ధ విమానంలో ప్రయాణించారు. ఈ ఘనత సాధించిన మూడో రాష్ట్రపతిగా, రెండో మహిళా రాష్ట్రపతిగా ఆమె నిలిచారు. ఇంతకుముందు మాజీ రాష్ట్రపతులు ఏపీజే అబ్దుల్ కలాం (2006), ప్రతిభా పాటిల్ (2009) కూడా సుఖోయ్-30 విమానాల్లో ప్రయాణించారు.ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్ సంస్థ తయారు చేసిన రఫేల్ యుద్ధ విమానాలను 2020 సెప్టెంబర్‌లో అంబాలా వైమానిక స్థావరంలో అధికారికంగా వాయుసేనలోకి ప్రవేశపెట్టారు. 2020 జులైలో ఫ్రాన్స్ నుంచి వచ్చిన తొలి ఐదు విమానాలను 17వ స్క్వాడ్రన్ 'గోల్డెన్ యారోస్'లో చేర్చారు. సుమారు 22 ఏళ్ల తర్వాత భారత వాయుసేనలోకి దిగుమతి చేసుకున్న తొలి యుద్ధ విమానం రఫేల్ కావడం విశేషం.

## మోదీ మంచివాడే... కానీ కఠినమైన వ్యక్తి

- మొదటి పేజీ తరువాయి

సంతకాలు చేస్తామని ప్రకటించారు. ఇదే సందర్భంలో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని, అందుకు మోదీ కఠిన వైఖరే కారణమని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."భారత్, పాకిస్థాన్‌ల విషయానికొస్తే... నేను భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నాను. నాకు ప్రధాని మోదీపై గొప్ప గౌరవం, ప్రేమ ఉన్నాయి. మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి" అని ట్రంప్ పేర్కొన్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు తాను మోదీకి ఫోన్ చేసి, "మీరు పాకిస్థాన్‌తో యుద్ధం ప్రారంభిస్తే మేం మీతో వాణిజ్య ఒప్పందం చేసుకోలేం" అని చెప్పినట్లు ట్రంప్ గుర్తుచేసుకున్నారు. "మోదీ చూడటానికి మంచి వ్యక్తి అయినా, ఆయన చాలా కఠినమైనవారు. యుద్ధం చేసి తీరుతామన్నారు. అయితే నా మాటలు విన్న రెండు రోజులకే మోదీ, షెరీఫ్ నాతో మాట్లాడి యుద్ధాన్ని ఆపేశారు" అని ట్రంప్ వివరించారు.కొంతకాలంగా ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. భారత్ రష్యా నుంచి చమురు కొనడం, అమెరికా భారత ఉత్పత్తులపై అధిక టారిఫ్‌లు విధించడం వంటి అంశాలు చర్చలకు అడ్డంకిగా మారాయి. అయితే ఇటీవల ట్రంప్, మోదీ ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఈ వివాదాలు పరిష్కారమైనట్లు తెలుస్తోంది. అమెరికా టారిఫ్‌లను 16 శాతానికి తగ్గించడానికీ, బదులుగా భారత్ రష్యా చమురు కొనుగోళ్లను తగ్గించుకోవడానికీ అంగీకరించినట్లు సమాచారం.

## యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి

- మొదటి పేజీ తరువాయి

వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. తుపాను బలహీనపడినా భారీ వర్షాలు ఉన్నందున ప్రజలను సురక్షిత ప్రదేశాల్లోనే ఉంచాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, వసతి కల్పించాలని స్పష్టం చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక పారిశుద్ధ్య కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈదురు గాలులు, భారీ వర్షాల మూలంగా కలిగిన నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ, నెల్లూరు జిల్లాలో పెన్నా నది, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయిని.. ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

## గాజులదిన్నె ప్రాజెక్ట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు పెన్ పవర్ , అక్టోబర్ 29 :** గోనేగండ్ల మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్ట్ ను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పరిశీలించారు. బుధవారం ఉదయం గోనేగండ్ల మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్ట్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ప్రాజెక్ట్ వద్ద సాగు నీటి సరఫరా పరిస్థితులు, జలాశయం నీటి నిల్వ స్థాయి, సాగు కాల్వల నిర్వహణ పనులు, మరమ్మత్తులు తదితర అంశాల గురించి ఇరిగేషన్ ఎస్‌ఈ ని అడిగి తెలుసుకున్నారు.. 4.5 టి ఎం సి సామర్థ్యం ఉన్న వాటిని 5.5 టి ఎం సి సామర్థ్యం పెంచినందుకు గాను బండ్ ఎత్తు, విస్తీర్ణం పెంచుకుంటూ వెళ్ళారని అందుకు సంబంధించిన పనులు, ఇంకా కొన్ని మరమ్మతుల పనులు నిధులు విడుదల కాక ఆగిపోయాయని ఇరిగేషన్ ఎస్‌ఈ కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా సంబంధిత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. కార్యక్రమంలో ఆదోని ఇంచార్జి ఆర్డీఓ అజయ్, ఇరిగేషన్ ఎస్‌ఈ బాలచంద్ర రెడ్డి, హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఎస్‌ఈ పాండురంగయ్య, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

వై.ఎస్.ఆర్. కడప


అన్నమయ్య జిల్లా

## ఆకాంక్షిత జిల్లాల ప్రగతి కోసం

# సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలి

### – ఆకాంక్షిత జిల్లాలు, మండలాల కార్యక్రమాలపై సమీక్ష సమావేశం

### – నీతి ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ మరియు ఆకాంక్షిత జిల్లా ప్రాబరి అధికారి సిద్ధార్థ జైన్



**వైయస్సార్ కడప పెన్ పవర్, అక్టోబర్ 29 :** ఆకాంక్షిత జిల్లాల ప్రగతిలో వైయస్సార్ కడప జిల్లా మరింత పురోగతి సాధించేందుకు సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలని నీతి ఆయోగ్ సెక్రెటరీ జాయింట్ సెక్రెటరీ మరియు ఆకాంక్షిత జిల్లా ప్రాబరి అధికారి సిద్ధార్థ జైన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని బోర్డ్ రూమ్ నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా మరియు ఆకాంక్షిత బ్లాక్ ప్రోగ్రాం ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రెటరీ మాట్లాడుతూ.. 2025 మార్చి నాటికి 73.6 స్కోరు సాధించి టాప్ 5 జిల్లాలలో వైయస్సార్ కడప జిల్లా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి గారిని అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యము, పౌష్టికాహారము, విద్యా, వ్యవసాయం మరియు నీటి వనరులు, ఆర్థిక స్వాలంబన & నైపుణ్యాభివృద్ధి,కనీస మౌలిక సదుపాయాలు విభాగాలలో సంబంధిత అధికారులు వినూత్నంగా ఆలోచించి వాటి తీసుకోవలసిన చర్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

ప్రతి అధికారి వారి అనుభవంతో వినూత్న పద్ధతులతో శాఖల ప్రగతికి పని చేయాలన్నారు. ఉదాహరణకు విద్యారంగానికి సంబంధించి కడప జిల్లాలో అమలవుతున్న స్మార్ట్ కిచెన్ విధానం అద్భుతంగా ఉందని అలాగే ప్రతి విభాగంలోనూ వినూత్న ఆలోచనలతో ప్రగతి సాధన దిశగా పని చేయాలన్నారు. వైద్యానికి సంబంధించి గర్భవతులలో రక్తహీనత నివారణకు తీసుకోవలసిన చర్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. బరువు తక్కువ గల పిల్లల పెరుగుదల కు తల్లిదండ్రులకు తగు సూచనలు ఇవ్వడం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునేలా సూచించాలన్నారు. పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాలలో శుద్ధమైన తాగునీరు అందించాలన్నారు. నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు ఏర్పాటు ద్వారా సత్ఫలితాలు ఉంటాయన్నారు. భూగర్భ జలాల పెంపునకు జిల్లా నీటి





## జిల్లాలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### - జిల్లా పరిషత్ చైర్మన్ పర్సన్ బోయ గిరిజమ్మ

**అనంతపురం పెన్ పవర్, అక్టోబర్ 29 :** జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు అనంతపురం జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలో జెడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జెడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ ఆధ్వర్యంలో స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయం గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖలపై జరిగిన సమీక్షలలో ఆయా శాఖల పురోగతి, ప్రభుత్వ పథకాలపై ఆయా శాఖల అధికారులు సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మతో పాటు ఇతర సభ్యులు మాట్లాడుతూ రైతుల సమస్యలు, హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలుపరిష్కరించాలని, అకాల వర్షాల కారణంగా తమ పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునే విధంగా ఆయా పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సంబంధిత శాఖ అధికారులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించాలని అధికారులకుసూచించారు. అదే విధంగా పలు సమస్యలపై చర్చించినారు. తొలుత మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రెడ్డప్పరెడ్డి మృతికి సంతాప సూచకంగా సభలో రెండు నిమిషాల పాటు మౌనం వహిస్తూ నివాళులు అర్పించారు. వ్యవసాయ శాఖ పై సమీక్షించారు. ఈ సందర్భంగా గౌరవ జిల్లా పరిషత్ అధ్యక్షులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు వెళ్లి ఈ అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆయా మండలాలకు సంబంధించిన రైతులకు జరిగిన నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. అలాగే ఆత్మకూరు మండలంలో సదరు పంట నష్టాన్ని అంచనా వేయమని కోరిన వ్యవసాయ అధికారులు పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ అధ్యక్షులు తెలిపిన విషయంపై ఇంతకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బుక్కరాయ సముద్రం జడ్పిటిసి మాట్లాడుతూ పుట్లూరు ,ఎల్లనూరు ప్రాంతాలలో పప్పుశనగ విత్తనాలు అందక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని దీనిపైన తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారి స్పందిస్తూ ఫసల్ బీమా యోజన కింద రైతులకు వరి పంట నష్టానికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేస్తున్నామని పప్పు సన్నగా విత్తన పంపిణీ త్వరలోనేమొదలుపెడతామని జడ్పిటిసి సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం తెలిపారు. గుమ్మగట్ట జడ్పిటిసి మాట్లాడుతూ అక్టోబర్ ఒకటో నుండి 15 తేదీ లోపల విత్తన పంపిణీ జరగాల్సి ఉండగా నవంబర్ ఒకటో తేదీ దగ్గరకు వస్తున్న కూడా విత్తన పంపిణీ జరగలేదని అలాగే అకాల వర్షాలకు వేరుశనగ పంట దెబ్బతిన్నదని కందుల పంట కూడా పూత లేక ఇబ్బంది పడుతున్న రైతులకు ఇన్సూరెన్స్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎరువుల కొడతా లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీ సత్య సాయి జిల్లా లో డిఆర్డిఏ శాఖ పురోగతిని వివరించవలసిందిగా జడ్పీ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో సుమారు రెండు 2,63,987 మంది లబ్ధిదారులు ప్రతి నెల రూ. 11 5. 54 కోర్టులో పెన్షన్ రూపంలో లబ్ధి పొందుతున్నారని అలాగే 20 25 - 26 ఆర్థిక సంవత్సరంలో 1- 4- 2025 నుండి 30- 9 - 20 25 వరకు 2,63 ,987 మంది పెన్షన్ దారులకు గాను రూ. 690. 92 కోట్ల రూపాయలను లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ డ్రోక్రా సంఘం నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చాయని దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే కొత్త పెన్షన్ల మంజూరు, వికలాంగుల పెన్షన్ల మంజూరు తదితర విషయాలపై చర్చించారు. స్త్రీ మరియు శిశు సంక్షేమ కమిటీ ద్వారా సమీక్షిస్తూ అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టిక ఆహారం సక్రమంగా అందలేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లా ప్రజా పరిషత్ నుండి అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తులకు గ్రాంట్ నిధులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో పనుల వివరాలు తెలియజేయాలని అడిగారు. అలాగే విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో డ్రాప్ ఓట్స్ కాకుండా సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ సూచించారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు అడిగిన విషయాలపై సంబంధిత శాఖ అధికారులు తగిన విధంగా వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పి సిఈఓ శివశంకర్, డిప్యూటీ సిఈఓ వెంకట సుబ్బయ్య,పలువురు స్టాండింగ్ కమిటీ సభ్యులు గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్, డి హీరేహాళ్ జెడ్పిటిసి హసీనా బాను, బుక్కరాయసముద్రం జడ్పిటిసి భాస్కర్ అనంతపురం రూరల్ జెడ్పిటిసి చంద్ర, నల్లమడ జడ్పిటిసి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆయా ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ లేకుండా భూ సమస్యలు పరిష్కరించాలి

### - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం పెన్ పవర్, అక్టోబర్ 29 :** జిల్లాలో ఆయా ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ లేకుండా భూ సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ, భూ బదలాయింపు, రీ సర్వే, ఈ పంట నమోదు మరియు కేంద్ర ప్రభుత్వ పథకం అయిన ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు మరియు ఇతర రెవెన్యూ అంశాల గురించి జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు (ఎన్హెచ్) 67, 510ఏ, 544, 52లకు సంబంధించి పెండింగ్ ఉన్న అనెగ్జర్స్, రిపోర్టులు పంపించాలన్నారు. వివిధ రైల్వే ప్రాజెక్టుల పరిధిలో భూములకు సంబంధించి పెండింగ్ ఉన్న నివేదికలను ఆర్డీఓలు పంపించాలన్నారు. మాజీ సైనికులకు అసైన్మెంట్ భూమి కేటాయించేందుకు సర్వే చేసి ప్రతిపాదనలు తయారుచేసి వచ్చే నెల 10వతేదీలోపు కలెక్టరేట్ కు పంపించాలని సూచించారు. కంబదూరు, గుత్తి పరిధిలో సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం లీజుకు సంబంధించి సర్వే పూర్తి చేసి నివేదికలు అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాను నష్టపరిహారం నివేదికలు సిద్ధం చేయాలి



**చిత్తూరు, పెన్ పవర్ అక్టోబర్ 29 :** నవంబర్ 5వ తేదీ లోపు మొంథా తుఫాను నష్టపరిహారం నివేదికలు సిద్ధం చేయాలిజిల్లా కలెక్టర్ సుమిత్ కమార్ పేర్కొన్నారు, బుధవారం స్థానిక కలెక్టరేట్ నుండి తన చాంబర్ నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా తుఫాను నష్ట గణన ప్రక్రియ అంశంపై జిల్లా లోని అధికారులతో టెల్ కన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను బాధితులకు నష్టి పరిహారం అందించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ జరిపి సంబంధిత రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పరిశీలన జరిపి వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు, నవంబర్ 5వ తేదీ లోపు నివేదికల సిద్ధం చేసినచో ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయి నిధులు మంజూరు చేయడానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు, విద్యుత్ శాఖ, హౌసింగ్, ఆర్డబ్ల్యూ ఎస్, పంచాయతీరాజ్ శాఖ, వ్యవసాయ, ఉద్యానవని శాఖ అధికారులు సమగ్ర రిపోర్ట్ డిఆర్ఓకి అందజేయాలని ఆదేశించారు, జిల్లా నిధుల నుండి కూడా మొంథా తుఫాను బాధితులకు నష్టపరిహారం అందజేయడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. వరి, వేరుశనగ, పంటలు ఎంత నష్టం జరిగిందో, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏ ఏ మండలాలలో ఎంత నష్టం జరిగిందో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు, ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖలు హెచ్ఓడిలు పాల్గొన్నారు.

## తెల్లవారుజామున ఎమ్మెల్యే దగ్గుపాటి ఆకస్మిక తనిఖీలు



**అనంతపురం పెన్ పవర్ అక్టోబర్ 29 :** అనంతపురం నగరంలో పారిశుద్ధ్య సమస్యపై ఇవాళ తెల్లవారు జామున ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు చేశారు. కోర్టు రోడ్డు లోని రెండవ మస్టర్ కార్యాలయానికి ఆకస్మికంగా వెళ్లారు. మున్సిపల్ కమిషనర్ బాలస్వామితో కలిసి ఈ తనిఖీలు నిర్వహించారు. అక్కడ కార్మికుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అయితే 100% హాజరు ఉండటం మీద ఆరా తీశారు. నెలరోజుల్లో ఒక్కరు కూడా గైర్హాజరు కాలేదా అంటూ అధికారులను ప్రశ్నించారు. 2వ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య పరిస్థితి పై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడే ఎందుకు ఫిర్యాదులు వస్తున్నాయని ప్రశ్నించారు. సచివాలయ కార్యదర్శులు ఎంతమంది వచ్చారు... వారు ఎక్కడ విధుల్లో ఉన్నారన్నది తెలుసుకున్నారు. ప్రతిరోజు ఉదయం ఫీల్డులో శానిటరీ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే అక్కడ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు విధి నిర్వహణలో అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. సుందర అనంతగా మార్చడానికి ప్రతి, శానిటరీ ఇన్స్పెక్టర్, మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు.

# స్మార్ట్ కిచెన్ విధానం దేశానికే ఆదర్శనీయం..!

### నీతీ ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ మరియు వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరీ అధికారి సిద్దార్థ్ జైన్ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో కలిసి సి.కె.దిన్నె జెడ్పీ హైస్కూలులో స్మార్ట్ కిచెన్ పరిశీలన



**కడప పెన్ పవర్,అక్టోబర్ 29 :** సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ నిర్వహణ అద్భుతంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మరింత బాగుందని దేశానికే ఆదర్శవంతంగా ఉన్నాయని.. నీతీ ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ మరియు వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరీ అధికారి సిద్దార్థ్ జైన్ సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పర్యటన లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోకలిసి రాష్ట్రానికే ఆదర్శవంతంగా నిర్మించి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ను సమర్ధ వంతంగా నిర్వహిస్తున్న సి.కె.దిన్నె జెడ్పీ హైస్కూలులోని సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ ను నీతి ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆకాంక్షిత జిల్లా, ఆకాంక్షిత బ్లాకుల అభివృద్ధిలో భాగంగా.. జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో పైలెట్ ప్రాజెక్టుగా అమలులోకి తీసుకొచ్చిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్మార్ట్ కిచెన్ షెడ్ నిర్వహణ గురించి ప్రాబరీ అధికారికి వివరిస్తూ... దేశంలోనే తొలిసారిగా సికె దిన్నె ఎంపిపి పాఠశాల ఆవరణలో రూ.56 లక్షల తో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ డ్ స్మార్ట్ కిచెన్ ద్వారా..ప్రతిరోజు చుట్టుపక్కల గ్రామా ల్లోని 33 పాఠశాలల్లోని 1758 మంది విద్యార్థు లకు శుచికరమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందివ్వడం జరుగుతుందన్నారు. డిసెంబర్ చివరి నాటికల్లా కడప జిల్లాలోని 11 మండలాల్లో 33 స్మార్ట్ కిచెన్ల ద్వారా 1,24,689 మంది విద్యార్థులకు రుచి, శుచికరమైన ఆహారాన్ని అందిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సికె దిన్నె 2, జమ్మలమడుగు 2, కడపలో 1 స్మార్ట్ కిచెన్ ల ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద 136 పాఠశాలలకు చెందిన 10,332 మంది విద్యార్థులకు 13 ప్రత్యేక వాహనాల్లో ఆహారాన్ని పంపేలా చర్యలు చేపడుతున్నామన్నారు. న్యూట్రిషనిస్ట్ పర్యవేక్షణలో సోలార్ పవర్ తో పనిచేసే ఈ స్మార్ట్ కిచెన్‌లో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నామన్నారు. మెరుగైన నాణ్యత కోసం ఇక్కడ ప్రత్యేక ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంటు నీటినే వంటకు ఉపయోగించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్ ను సందర్శించిన నీతి ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ వంటకు సంబంధించిన అన్ని ప్రక్రియలను,సరుకుల నాణ్యత, భోజనం తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్ఓ ప్లాంటు, ఆహార పంపిణీ వాహనాలను కూడా ప్రాబరీ అధికారి సిద్ధార్థ జైన్ క్షుణ్ణంగా పరిశీలించారు. వంట నిర్వాహకులను పలకరించగా.. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం శుచి, రుచితో కూడిన భోజనాన్ని నిర్ణీత సమయానికి తాము అందించ గలుగుతున్నామని, అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సులభంగా.. వంటను పూర్తి చేయగలుగుతున్నామని వంట సిబ్బంది తెలపడంతో... జాయింట్ సెక్రెటరీ సంతోషాన్ని, సంతృప్తి ని వ్యక్తం చేసారు. సికె దిన్నె స్కూలు స్మార్ట్ కిచెన్ పనితీరు అద్భుతంగా ఉందని, రాష్ట్రానికే కాదు.. దేశానికే ఆదర్శంగా స్మార్ట్ కిచెన్ విధానం ను రూపొందించారని. జిల్లా కలెక్టర్ ను ప్రాబరీ అధికారి అభినందించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజల అభివృద్ధికి బాటలు వేస్తున్నాయని.. సంక్షేమ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో



జిల్లా యంత్రాంగం, సంబందిత అధికారుల సేవలు ప్రశంస నీయమని జాయింట్ సెక్రెటరీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిపి నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, విద్యాశాఖ ఆర్జెడి శామ్యూల్, డీఈవో శంశుద్దిన్, హౌసింగ్ పీడి రాజరత్నం,సమగ్ర శిక్ష ఏపీసి ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేట, బద్వేలు సబ్ జైలుల లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విజిట్



**కడప పెన్ పవర్ అక్టోబర్ 29 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు రాజంపేట మరియు బద్వేల్ సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే రాజంపేట మండల న్యాయ సమితిని, బద్వేలు మండల న్యాయ సేవా సమితిని, మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మరియు బద్వేల్ సబ్ జైలుల సూపర్డెంట్ లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## ఆదర్శ కనకరాజుకు విద్యావిభాగంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జీవిత సాఫల్య పురస్కారం



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 29 :** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో నిర్వహించబడిన లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు ఫంక్షన్లో ప్రముఖ విద్య, సేవా మూర్తి ఆదర్శ విద్యా సంస్థల అధినేత ప్రజల ప్రగళ్లపాటి కనకరాజు విద్యావిభాగంలో జీవిత సాఫల్య పురస్కారం అవార్డులో అందుకున్నారు. ఈ ఘన సమారోహం సమాజ సేవ, విద్యా సేవ స్ఫూర్తిగా, వాసవి ధర్మా తత్వాల సమ్మేళంగా నిలిచింది. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సమావేశం మంగళ వారం పుదుచ్చేరిలో అధ్యక్షులు వి ఎస్ డైమండ్ కేజీఎఫ్ ఇరుకుల్లా రామకృష్ణ అధ్యక్షతన జరిగిందని ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ సెక్రెటరీ నాగమణి తెలిపారు. కనకరాజుకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జీవిత సాఫల్య పురస్కారను పుదుచ్చేరి పబ్లిక్ వర్క్ శాఖామంత్రి ధీరుకే లక్ష్మీనారాయనన్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రగళ్లపాటి కనకరాజు మాట్లాడుతూ ఈ గౌరవం దక్కటం నా వ్యక్తిగత విజయం కాదని ముఖ్యంగా నా శ్రీమతి డాక్టర్ నాగమణి యొక్క ప్రోత్సహం ఎంతో ఉందని, మా పిల్లలు అల్లుళ్ళు సహకారంతో మా యొక్క అధ్యాపక బృందం విద్యార్థులు విద్యార్థులకు ఉత్తమ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించారని అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జీవిత సాఫల్య పురస్కారం ను అందుకున్న ఆదర్శ విద్యాసంస్థల అధినేత కనకరాజుకు ఆదర్శ డైరెక్టర్స్ హారిక సంతోష్, ప్రవల్లిక సంతోష్, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధరావు, వైస్ ప్రిన్సిపాల్ సుజిని, ఆదర్శ హై స్కూల్ హెడ్మాస్టర్ సత్యనారాయణ, అధ్యాపక బృందం కామేష్, ప్రేమ్, డాక్టర్ పైడిరాజు, సంకీర్తన, డాక్టర్ గణేష్ మరియు కొత్తపల్లి ఆర్యవైశ్య గౌరవ అధ్యక్షులు వీరస్వామి, సోదరులు రామమూర్తి సుబ్బారావు రామకృష్ణ తదితరులు అభినందించారు.


### ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో

## ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

### "స్వయం సమృద్ధ భారత్ కార్యక్రమం - మనందరం భాగస్వాములం కావాలి" మంత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హరీష్ బాబు



**ధర్మవరం, పెన్ పవర్ అక్టోబర్ 29 :** భారతదేశాన్ని ఆత్మనిర్భరంగా, స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే ప్రధాని నరేంద్ర మోదీ గారి ప్రధాన లక్ష్యమని మంత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హరీష్ బాబు అన్నారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో "ఆత్మనిర్భర్ భారత్-స్వయం సమృద్ధ భారత్" కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... మన దేశం 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా ఎదగాలన్న దిశగా మనమందరం కృషి చేయాలి. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 'స్వయం సమృద్ధ భారత్' కార్యక్రమాన్ని ప్రతి పౌరుడు తన వంతు పాత్రగా స్వీకరించాలి అని హరీష్ బాబు అన్నారు. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులను ప్రోత్సహించాలనీ, "Vocal for Local" భావనను ప్రజల్లో మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దేశ అభివృద్ధికి ప్రాథమిక బలం స్వదేశీ ఉత్పత్తులే అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చూపుతున్న దిశలో మన దేశం ఆత్మనిర్భరత వైపు దూసుకెళ్తోంది. ప్రతి గ్రామం, ప్రతి పట్టణం స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది. మన అందరం కలిసి ఈ ఉద్యమానికి భాగస్వాములమవుదాం అని ఆయన పిలుపునిచ్చారు. ఆత్మనిర్భర్ భారత్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి వెళ్లి మోదీ సంకల్పాన్ని ప్రతి ఇంటికీ చేర్చాలని హరీష్ బాబు అన్నారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు, పట్టణ అధ్యక్షులు చంద్ర, బత్తలపల్లి మండల అధ్యక్షులు భాస్కర్, మైనార్టీ నాయకులు నబి రసూల్, చిన్న ఆదినారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.




# "స్టార్టప్ కడప" లక్ష్యం యువతకు స్ఫూర్తిదాయకం..!!

**- నీతీ ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ, వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరీ అధికారి సిద్దార్థ్ జైన్**

**- జిల్లా కలెక్టర్ తో కలిసి పి-4 "స్టార్టప్ కడప హబ్" సెంటర్ నిర్మాణ పనుల పరిశీలన**




**కడప, పెన్ పవర్ అక్టోబర్ 29 :** ఉద్యోగం అందుకునే స్థాయి నుండి ఉద్యోగాలు అందించే స్థాయికి యువత ఎదగాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం యువతకు స్ఫూర్తిదాయకం అని.. నీతీ ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ, వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరీ అధికారి సిద్దార్థ్ జైన్ ప్రశంసించారు. బుధవారం కడప ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో నిర్మణంలో ఉన్న పి-4 "స్టార్టప్ కడప హబ్" సెంటర్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోకలిసి కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరీ అధికారి సిద్దార్థ్ జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ.. ఆశించే స్థాయి నుండి శాశించే స్థాయికి ఎదగాలంటే ప్రతిఇంటి నుండి ఒక స్టార్ట్ అప్ ఎదగాలనే ఆయన ఆలోచన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం అన్నారు. ఇలాంటి స్టార్ట్ అప్ కడప కార్యక్రమాన్ని ఆకాంక్ష జిల్లా కడపలో ప్రప్రథమంగా ఏర్పాటు కావడం అభినందనీయం అన్నారు. అధునాతన సదుపాయాలతో అన్ని రకాల మౌలిక వసతులతో రూపుదిద్దుకోనున్న కడప స్టార్ట్ అప్ కేంద్రం.. యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషించనుందన్నారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. అత్యాధునిక వసతులతో రూ. 10 కోట్లు అంచనా వ్యయంతో స్టార్ట్ అప్ కడప సెంటర్ నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన కడప జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని స్టార్ట్ అప్ కడప హబ్ ను ముందుకు తీసుకువెళ్తామన్నారు. 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో జి+3 అంతస్తులతో, పిఈబి టెక్నాలజీ ఆధారంగా ఈ భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు గాను స్థానిక షిర్డీసాయి ఎక్ట్రికల్స్ రూ.4 కోట్లు విరాళం అందించనుందన్నారు. "స్టార్టప్ కడప" కేవలం ఒక భవనం మాత్రమే కాదని.. ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక అన్నారు. ఆవిష్కరణ, ఆధునికత, అభివృద్ధికి దిక్సూచిగా ఇది నిలవనుందన్నారు. కడపను పారిశ్రామిక, సాంకేతిక దిశలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక మంచి విజ్ఞాన, ఉద్యోగ, ఉపాధి వనరుగా ఉపయోగపడనుందన్నారు. కడప జిల్లా ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచే దిశగా.. "స్టార్ట్ అప్ కడప" పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన.. నిర్మాణ ప్రాజెక్ట్ కు సంబంధించిన వివరాలను బిల్డింగ్ నమూనా మ్యాపు ద్వారా క్షుణ్ణంగా ప్రాబరీ అధికారికి వివరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడి రాజరత్నం, ఆకాంక్షిత జిల్లా నోడల్. అధికారి జోయల్ విజయ్ కుమార్, సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# 31న ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

## మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో ఐక్యతా ర్యాలీ



**ధర్మవరం పెన్ పవర్, అక్టోబర్ 29 :** భారతదేశపు ఉక్కు మనిషి, జాతి సమైక్యతకు ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని, ఈ నెల అక్టోబర్ 31వ తేదీన దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించబడనుంది. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ ఐక్యతా ర్యాలీల లో భాగంగా, సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో కూడా ఈ కార్యక్రమం వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలో జాతీయ ఐక్యతా ర్యాలీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 31వ తేదీ ఉదయం ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరుకానున్నారని అన్నారు.

ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారతదేశాన్ని ఏకం చేసిన మహానేత. ఆయన దేశ సమైక్యత, ఐక్యత, అఖండతకు అంకితమైన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం. ఆయన స్ఫూర్తితో నడవాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ధర్మవరం ప్రజలంతా ఈ ర్యాలీలో చురుకుగా పాల్గొని జాతీయ ఐక్యతకు తమ మద్దతు తెలియ జేయాలి, అని తెలిపారు. దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన పటేల్ జయంతి సందర్భంగా జరగబోయే ఈ ఐక్యతా యాత్రలో మన యువతరం దేశభక్తి, ఐక్యతా భావాలను మరింతగా బలపరుచుకోవాలి. రాజకీయాలకు అతీతంగా నిర్వహించబడుతున్న ఈ జాతీయ ఐక్యతా కార్యక్రమంలో ధర్మవరం ప్రజలందరూ, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, పుర ప్రముఖులు, సామాజిక సేవకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని హరీష్ బాబు పిలుపునిచ్చారు.

## డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి





**బద్వేలు పెన్ పవర్ అక్టోబర్ 29 :** బద్వేలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని గుంతపల్లె పంచాయతీ పరిధిలో.. రోడ్లపైకి ప్రవహిస్తున్న డ్రైనేజీ కాలువ నిర్మాణ పనుల కార్యాచరణ కోసం.. డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చేరుకూరి. అనంతరం లక్ష్మీపాలెం పరిధిలోని బద్వేలు పెద్ద చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్.. చెరువు, విస్తీర్ణం, ఆయకట్టు విస్తీర్ణం, నీటి వాడకం తదితర అంశాలను.. నీటి సంఘం సభ్యులు, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. చాలా ఏళ్ల తర్వాత పూర్తిస్థాయిలో బద్వేలు పెద్ద చెరువుకు నీరు వచ్చి చేరడంతో.. నీటిని వృధా కాకుండా కాపాడుకోవడంతో పాటు, నీటిని సద్వినియోగం చేసుకోవడంపై ఇరిగేషన్ అధికారులకు సూచనలిచ్చిన జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ తోపాటు హాజరైన బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, జెడ్పి సీఈవో ఓబులమ్మ, బద్వేలు, గోపవరం తహశీల్దార్లు ఉదయ్ భాస్కర్, త్రిభువన్ రెడ్డి, బద్వేలు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, నీటి సంఘం చైర్మన్ సురేంద్ర, వైస్ చైర్మన్ వెంకట సుబ్బారెడ్డి, ఇరిగేషన్ డిఈ వేణుగోపాల్ రెడ్డి రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ సమావేశం







**అనంతపురం పెన్ పవర్ అక్టోబర్ 29 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో షెడ్యూల్డ్ కులాల సంక్షేమము కొరకు ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ లతో కలిసి ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల గారు పాల్గొనగా.. కమిటీ సభ్యులు కావలి గ్రీష్మ ప్రసాద్, ఎమ్మెస్ రాజు, విజయ్ కుమార్ బి.ఎన్, రోషన్ కుమార్ సొంగ, తదితరులు పాల్గొన్నారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్, ఎస్పీలు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.

### ఆకాంక్షిత జిల్లాల ప్రగతి కోసం

## సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలి

**(3వ పేజీ తరువాయి)** యాజమాన్య సంస్థ కు లక్ష్యాన్ని నిర్దేశించి లక్ష్యసాధనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి వివరిస్తూ...జిల్లా లో సామాజిక స్థాయిని (అభివృద్ధి) ..ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మని,ప్రతి మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరానికి ఒకసారి.. 5 అంశాలకు సంబంధించి.. కీ పారామీటర్ ఇండికేట్ (కెపిఐ) పాయింట్ల ఆధారంగా.. ప్రగతిని లెక్కించడం జరుగుతుందన్నారు. అందులో..ముఖ్యంగా హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎడ్యుకేషన్ -నైపుణ్యాభివృద్ధి,గృహ నిర్మాణం, వ్యవసాయం, పశుపోషణ, మౌలిక సదుపాయాలు ...మొదలైన శాఖల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో మరింత పురోగతి సాధనకు కృషి చేస్తున్నామన్నారు. అందు కోసం.. సంబందిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఆ మేరకు.. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో భాగంగా జాయింట్ సెక్రెటరీ గారిని జిల్లా కలెక్టర్ సన్మానించి సత్కరించారు. ఈ సమావేశంలో సిపిఓ హాజరతయ్య, డీఈవో షంషుద్దీన్, డిఆర్‌డిఏ పిడి రాజ్యలక్ష్మి ,హౌసింగ్ పిడి రాజా రత్నం, డిఎం&హెచ్ఓ డా.నాగరాజు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పొరుమామిళ్ల చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



**పోరుమామిళ్ల పెన్ పవర్ అక్టోబర్ 29 :** చెరువు పరిశీలనలో భాగంగా నీటిమట్టం, చెరువు విస్తీర్ణం, ఆయకట్టు విస్తీర్ణం, నీటి వాడకం తదితర అంశాలను.. నీటి సంఘం సభ్యులు, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్. చాలా ఏళ్ల తర్వాత పూర్తిస్థాయిలో పొరుమామిళ్ల చెరువుకు నీరు వచ్చి చేరడంతో.. నీటిని వృధా కాకుండా కాపాడుకోవడంతో పాటు, నీటిని సద్వినియోగం చేసుకోవడంపై ఇరిగేషన్ అధికారులకు సూచనలిచ్చిన జిల్లా కలెక్టర్. చెరువు కట్టకు సంబంధించి ఏవైనా మరమ్మతులు ఉంటే... ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్. ద్వారా చేపట్టాలని అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్. చెరువు క్రింద గ్రామం దమ్మనపల్లె ఎస్సి కాలనీలో.. చెరువు కట్ట నుండి వీధిలోకి లీకవుతున్న నీటిని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి.. వర్షాల నేపత్యంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్. ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ తోపాటు హాజరైన బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, పొరుమామిళ్ల తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, నీటి సంఘం చైర్మన్ తోట వెంకటయ్య, ఇరిగేషన్, రెవెన్యూ, అధికారులు తదితరులు.

### మొంథా తూఫాన్ ప్రభావం-4378.23 హెక్టార్లలో పంట నష్టం



**కడప పెన్ పవర్ అక్టోబర్ 29 :** మొంథా తూఫాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా 26.10.2025 నుండి 29.10.2025 వ తేది వరకు కురిసిన వర్షాలకు వైయస్సార్ కడప జిల్లాలో 4378.23 హెక్టార్లల్లో పంట నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులు పంట నష్టాలపై అంచనా వేసి ప్రాథమిక నివేదికలు పంపటం జరిగిందన్నారు. ఈ నివేదికలను తగు చర్యల నిమ్మిత్తం వ్యవసాయ కమీషనర్, ఆంధ్ర ప్రదేశ్, గుంటూరు వారికి పంపించడం జరిగిందని పై ప్రకటనలో తెలిపారు.

**పంట నష్ట వివరాలు :** వరి 1071 హెక్టార్లు, కంది 68 హెక్టార్లు, మినుము 2559.24 హెక్టార్లు, పెసర 119.5 హెక్టార్లు, మొక్కజొన్న 145 హెక్టార్లు, జొన్న 4 హెక్టార్లు, వేరుశనగ 71.64 హెక్టార్లు, పత్తి 284.5 హెక్టార్లు, నువ్వులు 55.35 హెక్టార్లలలో పంట నష్టం జరగగా, జిల్లా వ్యాప్తంగా 4378.23 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది.

### వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల పెన్ పవర్, అక్టోబర్ 29 :** మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నంద్యాల పట్టణంలోని లోతట్టు ప్రాంతాల పరిస్థితిని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. కుందు నది పరివాహక ప్రాంతం (నందమూరి నగర్ వైపు రోడ్), వైయస్సార్ నగర్, పెద్దకొట్టాల, శ్యాం నగర్ చామకాలువ, శ్రమదానం బ్రిడ్జి, ఎస్బిఐ కాలనీ (రామకృష్ణ పిజి కాలేజ్ సమీపం) వంటి ప్రాంతాల్లో పర్యటించి వరద నీటి ప్రవాహం, కాలువల సామర్థ్యం, మరియు నివారణ చర్యలను సమీక్షించారు.

# బలహీన వర్గాలకు సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం పెన్ పవర్, అక్టోబర్ 29 :** షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి ప్రభుత్వం నుండి అందే సహాయ సహకారాలను నిష్పక్షపాతంగా పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ పథకంలో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు వ్యయానికి సంబంధించిన శాతం ఖచ్చితంగా ఖర్చు చేసేలా చూడాలని ఆయా శాఖల జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాస్థాయి అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు లబ్ధి అందేలా చూడాలన్నారు. ఇందులో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో ఎస్సీ లబ్ధిదారులను గుర్తించి పొలంబడి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. డిఆర్డిఏ పరిధిలో స్త్రీనిధి కింద రుణాల మంజూరులో పురోగతి తీసుకురావాలని, ఉపాధి హామీ కింద ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూర్చాలని, హౌసింగ్, ఏపీఎంఐపీ, ఇతర అన్ని శాఖల పరిధిలో వారికి కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలకు లబ్ధి చేకూర్చేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ జెడి ఖుష్బూ కొఠారి, జెడ్పి సీఈవో శివశంకర్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిపిఓ నాగరాజు నాయుడు, హౌసింగ్ పిడి శైలజ, డిఆర్డిఏ పిడి శైలజ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డిసిఓ అరుణకుమారి, డిఎంహెచ్ఓ ఈబి.దేవి, సిపిఓ అశోక్ కుమార్, పిఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, హార్టికల్చర్ ఉమాదేవి, డీఐసి డిఎం శ్రీనివాసరావు, ఏపీఎమ్ఐపి పిడి రఘునాథరెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి : శాసనసభ్యుల కమిటీ బృందం



**అనంతపురం, పెన్ పవర్ అక్టోబర్ 28 :** రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల శాసన కమిటీ కృషి చేస్తుందని కమిటీ అధ్యక్షులు కుమార రాజా తెలిపారు. మంగళవారం ఉదయం అనంతపురం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో షెడ్యూల్ కులాలకు చెందిన సంఘాల నాయకులు మరియు ప్రజల నుండి వివిధ ఫిర్యాదులను కమిటీ బృందం స్వీకరించింది. కమిటీ చైర్మన్ కుమార రాజా తో పాటు సభ్యులు ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, శాసనసభ్యులు ఎం.ఎస్. రాజు, బోనెల విజయచంద్ర, రోషన్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎస్సీ వర్గాల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా శాసనసభ కమిటీ బృందం చర్యలు తీసుకుంటుందని పేర్కొంది. ప్రస్తుతం వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా వచ్చిన సమస్యలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులను ఆదేశించడం జరుగుతుందని శాసనసభ కమిటీ బృందం తెలిపింది. అంతకుముందు అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అనంతపురం డివిజన్ ఆర్ డి ఓ కేశవ నాయుడు పలువురు నాయకులు కమిటీ బృందానికి పుష్పగుచ్ఛాలను, మొక్కలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేకంగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్. ఎస్. రాజు ఫిర్యాదు దారుల వినతులను సావధానంగా వింటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు.మూడు గంటల పాటు ప్రజల నుండి వినతులను స్వీకరించి వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఫిర్యాదు దారులకు కమిటీ బృందం ఆత్మస్థైర్యాన్ని కల్పిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

**వినతుల కొన్ని వివరాలు ఇలా ఉన్నాయి :** రాప్తాడు నియోజకవర్గంఆత్మకూరుమండలంలోని మది గుబ్బ గ్రామ నివాసి పద్మావతి అనే ఎస్. సి. కులానికి చెందిన మహిళ కు సంబంధించి సర్వే నంబర్ 163/8 లో 47 సెంట్ల భూమిని ఇతరులు దౌర్జన్యంగా కబ్జాచేసుకున్నారని రీసర్వేలో తన పేరు ను అధికారులు తొలగించి నందున తనకు న్యాయం చేయాలని కోరుతూ కమిటీ బృందానికి ఫిర్యాదు చేసింది. జిల్లాలో దళిత మరియు గిరిజనులపైజరుగుతున్న దాడులపై నమోదు అయిన కేసులపై విచారణసకాలంలో పూర్తి చేయాలని ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధకచట్టం జిల్లావ్యాప్తంగా సక్రమంగా అమలు చేయాలని వివిధ సంఘాలకు చెందిన నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. గత ప్రభుత్వంలో అంబేద్కర్ విదేశీ విద్యను నీరుగార్చి కోట్లాదిమంది దళితుల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా పథకాన్ని నీరుగార్చినందున అంబేద్కర్ విదేశీ విద్య పేరును కొనసాగించాలని గత ప్రభుత్వ హయాంలో ఎస్టీ ఎస్టీలకు 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిందని తిరిగి ఆ పథకాలను అమలు చేయాలని ప్రతి మండల కేంద్రంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేయుటకు కృషి చేయాలని జిల్లాలో ఎస్సీ, ఎస్టీ పేదలకు గత 60 సంవత్సరాలుగా ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ అనేక విధాలుగా ఆదుకుంటున్నందున ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ ను కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తూ పలువురు దండోరా నాయకులు వినతి పత్రాన్ని



సమర్పించారు. ఎస్సీ ఎస్టీ ప్రజలకు సంబంధించిన భూకబ్జాల సమస్యలు పరిష్కరించాలని నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలను ఆధునికంగా అన్ని సౌకర్యాల తో నిర్మించాలని భూమిలోని ఇండ్ల స్థలాలు లేని ఎస్సీ ప్రజలకు ప్రభుత్వం వాటిని మంజూరు చేయాలని వివిధ సంఘాల నాయకులు అర్జీని సమర్పించారు. ఎస్కే యూనివర్సిటీకి2017 సం " లో బ్యాగ్ లాక్ నోటి ఫికేషన్ఇవ్వడంజరిగిందని చాలా కాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసే విధంగా కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరుతూ ఎం ఈ ఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. బుడగలనుఎస్సీ కులంలో చేర్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి భూ సమస్యలు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం తదితర అంశాల పై వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసెంబ్లీ అసిస్టెంట్ సెక్రటరీ డా. రమణయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారి, వివిధ ఎస్సీ ఎస్టీ సంఘాలకు చెందిన ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఫిర్యాదుదారులుతదితరులు పాల్గొన్నారు

## ఈపంటపై సామాజిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

### సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం,పెన్ పవర్ అక్టోబర్ 29 :** ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూపర్ చెక్ (సామాజిక తనిఖీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం అనంతపురం రూరల్ మండలంలోని తాటిచెర్ల గ్రామం పరిధిలో ఈ క్రాప్ బుకింగ్ సూపర్ చెక్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. – ముందుగా అనంతపురం రూరల్ మండలంలోని తాటిచెర్ల గ్రామం పరిధిలో పి.రామగోపాల్ %ూ/ూ% నారాయణకు చెందిన సర్వే నంబర్ 308/3ఏలోని 2.74 ఎకరాల పొలంలో దానిమ్మ పంట సాగు చేయగా, ఈ క్రాప్ బుకింగ్ లో జిల్లా కలెక్టర్ సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం పి.సుదర్శనాచారి %ూ/ూ% గురుప్రసాద్ కు చెందిన సర్వే నంబర్ 320/1బిలోని 1.07 ఎకరాల పొలంలో నిమ్మ పంట సాగు చేయగా, ఈ క్రాప్ బుకింగ్ లో జిల్లా కలెక్టర్ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్లు, పంటల సాగు, విస్తీర్ణం, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. – ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ లో సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సామాజిక తనిఖీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్, తహసిల్దార్ మోహన్ కుమార్, ఏవో వెంకటకుమార్, ఉద్యాన అధికారి రత్న కుమార్, విహెచ్ఏ గంపరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల కారణంగా కూలిన శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి పురాతన గృహాన్ని గురువారం రాత్రి పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**భీమటం పెన్ పవర్ అక్టోబర్ 29 :** బ్రహ్మం గారి గృహాన్ని అధికారులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్. లి లిరెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు, మఠం నిర్వాహకులు, బ్రహ్మం గారి గృహ సంరక్షకులతో బ్రహ్మంగారి గృహం గురించి అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్. 1978-79 మధ్య కాలంలో బ్రహ్మంగారి గృహాన్ని మట్టి, పలకరాయి, చెక్క స్తంభాల ఆధారంతో నిర్మించడంతో.. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల వల్ల చెక్కస్తంభాలు కృంగిపోయి.. ఈ మట్టి నివాసం కూలిపోయిందని తెలిపిన జిల్లా కలెక్టర్. ఇంటాక్ సంస్థ వారి సహకారంతో.. పూర్వపు ఉనికి కోల్పోకుండా, భక్తుల మనోభావాలు నొచ్చుకునే అవకాశాలు లేకుండా, అదే మెటీరియల్ తో ప్రత్యేక ఆర్కిటెక్చర్లు, ధార్మిక పరిషత్ సలహాలు, సూచనల మేరకు... కూలిన ఇంటి పునర్నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపిన జిల్లా కలెక్టర్. ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ తోపాటు హాజరైన బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, బి.మఠం తహశీల్దార్ కార్తీక్, ఇండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు తదితరులు.

## పారిశ్రామిక వాడలో జంగిల్ క్లియరెన్స్ పనులు



**అనంతపురం,పెన్ పవర్ అక్టోబర్ 29 :** ఏపీఐఐసీ ఇండస్ట్రీస్ పార్ట్నర్షిప్ కార్యక్రమం మరియు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో స్థాపించబడిన అనంతపురం పారిశ్రామికవాడ ప్రాంతంలో బుధవారం సంబంధిత శాఖ అధికారులు ఉద్యోగ సిబ్బంది పాల్గొని పారిశ్రామిక వాడలో ఉన్న పిచ్చి మొక్కలను జెసిబితో తొలగించి పరిశుభ్రంగా మైదానాన్ని తీర్చిదిద్దారు. త్వరలోనే పారిశ్రామిక వాడలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నెలకొల్పేందుకు మొక్కలు నాటడం ,సుందరీకరణపనులు తదితరకార్యక్రమాలనుచేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం నందు జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ, ఎస్.వి.ఎస్.ఎస్. నాగకుమార్, ఏపీఐఐసీ మేనేజర్ మల్లికార్జున,ఏపీఐఐసీ జూనియర్ మేనేజర్ శివ మోహన్ కృష్ణ, ఎం.వి. సాయి సాగర్, సీనియర్ ఐటి అసోసియేట్, వర్క్ ఇన్స్పెక్టర్ షఫీ , కలందర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం, ప్రజల కోసం భయం పక్షపాతం లేకుండా బాగా పని చేయాలి

– జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్




**అనంతపురం పెన్ పవర్, అక్టోబర్ 29 :** ప్రభుత్వం, ప్రజల కోసం ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా బాగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో అభ్యర్థులకు కారుణ్య నియామకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 78 మంది దరఖాస్తు దారులకు కారుణ్య నియామకాల పత్రాలను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాల కింద మొత్తం 78 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. కారుణ్య నియమాకాలు చాలా కాలం నుంచి పెండింగ్ ఉన్నాయని, గత ఒకటిన్నర నెల రోజుల నుంచి ప్రత్యేక డ్రైవ్ గా దీన్ని పూర్తి చేయాలని నిర్ణయం తీసుకొని ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లామన్నారు. కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఏ సెక్షన్ సూపరింటెండెంట్, డిఆర్ఓ, సిబ్బంది కారుణ్య నియామకాల అంశంపై కూర్చుని బాగా పనిచేశారని, వారందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ సర్వీసులో పనిచేయాలన్న అవకాశం తక్కువ మందికి దొరుకుతుందని, ఉద్యోగంలో రకరకాల ఇబ్బందులు రావచ్చని, ఒత్తిడిలు కూడా వస్తాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం బాగా పని చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేసి ఫైల్ పంపిస్తేనే ఉన్నత స్థాయిలో ఆమోదం లభిస్తుందన్నారు. రకరకాల శాఖల్లో ఉద్యోగాలు పొందిన వారు మంచిగా పని చేయాలని, ప్రజలకు చేయగలిగిన లబ్ధి కలిగించాలని, అందరికీ అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, ఏవో కార్యాలయం అధికారులు, అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ కపిలేశ్వరాలయంలో శ్రీ కాలభైరవస్వామివారి హెూమం







తిరుపతి పెన్ పవర్ అక్టోబర్ 29 : తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో హెూమ మహెూత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ కాలభైరవస్వామివారి హెూమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజ, అష్టభైరవ హెూమం, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, కలశాభిషేకం, నివేదన, హారతి నిర్వహించారు. అక్టోబర్ 30 నుండి నవంబర్ 07 వరకు ఛండీహెూమం. అక్టోబర్ 30 నుండి నవంబర్ 07 వరకు శ్రీ కపిలేశ్వర స్వామి ఆలయంలో 9 రోజుల పాటు జరుగనున్న శ్రీ కామాక్షి అమ్మవారి ఛండీ హెూమానికి బుధవారం సాయంత్రం అంకురార్పణ జరుగనుంది. గృహస్తులు రూ.500/- చెల్లించి టికెట్ కొనుగోలు చేసి ఒక రోజు హెూమంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## "ప్రజాదర్బార్" సమస్యల పరిష్కారానికి కృషి

### – రాష్ట్ర ఆర్థిక& ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్





అనంతపురం పెన్ పవర్ అక్టోబర్29 : అనంతపురం నగరంలోని రామ్ నగర్ లో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక % డ% ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ రకాల ప్రజా సమస్యలపై ప్రజలు, నాయకుల నుంచి వినతి పత్రాలను మంత్రి పయ్యావుల కేశవ్ స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు, నాయకులు, ప్రజల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి, ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే దగ్గుపాటి ఆకస్మిక తనిఖీలు

## ఓపీ చీటీలు ఇవ్వడం దగ్గర నుంచి ప్రతి విభాగం తనిఖీ ఎమ్మెల్యే దగ్గుపాటి




అనంతపురం పెన్ పవర్ అక్టోబర్ 29 : వైద్యులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవన్న ఎమ్మెల్యే త్వరలో 1200పడకల ఆసుపత్రిగా మారుస్తామన్న దగ్గుపాటి సిబ్బంది ఎక్కడైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఉదయం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి స్లిప్పులు ఇచ్చే గదుల దగ్గర నుంచి అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఓపీని, వార్డులను, ఫార్మసీను కూడా పరిశీలించారు. రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చాలా విభాగాల్లో 9:30 అయినా వైద్యులు రాకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందుకు ఇంత సమయమైనా వైద్యులు రావడం లేదు, ఎంతవరకు ఓపి నడుస్తుంది అన్న అంశాలపై సూపర్డెంట్ తో మాట్లాడారు. మరోసారి వైద్యులు ఇలా సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు. అలాగే ఆసుపత్రిలో ఎంత మంది ఇన్ పేషెంట్లు ఉన్నారు.. ప్రతిరోజు ఔట్ పేషెంట్లు ఎంత వరకు వస్తున్నారన్నది కూడా తెలుసుకున్నారు. అక్కడున్న సౌకర్యాలపై కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ.. గత 20 ఏళ్ల నుంచి ప్రభుత్వాసుపత్రి 560 పడకలగా మాత్రమే ఉండటం వలన ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ప్రతిరోజు ఇన్ పేషెంట్లు 2000 నుంచి 200500 మంది వరకు ఉన్నారని.. అలాగే ఔట్ పేషెంట్లు 1200 మంది వరకు వస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆసుపత్రికి వచ్చే బడ్జెట్, వైద్యులు, సిబ్బంది, సౌకర్యాలు చాలడంలేదన్నారు. ఇదే అంశాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కూడా చర్చించామని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అన్నారు. త్వరలోనే 1200పడకల ఆసుపత్రిగా మారుస్తామని స్పష్టం చేశారు. సిబ్బంది ఎక్కడైనా రోగుల వద్ద నుంచి డబ్బులు తీసుకున్నా.., విధుల్లో నిర్లక్ష్యం వహించిన, వైద్యులు సమయపాలన పాటించకపోయినా గట్టి చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఆర్ఎంఓ హేమలత, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోనంకి గంగారం, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

## నగరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదాం

- మంత్రి టీ జీ భరత్





**కర్నూలు పెన్ పవర్ అక్టోబర్ 29 :** కర్నూలు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ, అగ్రగామిగా నిలుపుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో కమిషనర్ పి. విశ్వనాథ్‌తో కలిసి అన్ని విభాగాల అధికారులు, అమినిటీస్ కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ముందుగా నగరంలో రూ.12.62 కోట్లతో జరుగుతున్న 62 అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్ల వారీగా సమీక్ష నిర్వహించారు. జాప్యం జరుగుతున్న పనులపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలస్యం చేసే కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కర్నూలుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రగతిలో ముఖ్య స్థానాన్ని ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సుముఖంగా ఉందని, దీన్ని నగర శివార్లలో కాకుండా బి, సి క్యాంపుల్లో ఏర్పాటు చేసే అంశంపై ఇటీవల విదేశీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి సైతం దీనిపై సానుకూలంగా ఉన్నారని తెలిపారు. 160 ఎకరాలకు పైగా భూమి ఉందని, ఎకరా 100 కోట్ల వరకు విలువ ఉందని, దీన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటామన్నారు. వాటిలోనే స్మార్ట్ సిటీ ప్రాజెక్టులకు స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బుధవారపేట మెడికల్ కాలేజీ మలుపు వద్ద ఉన్న షాపుల అంశం న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకు నడుచుకుంటామని తెలిపారు. అనంతరం రహదారుల విస్తరణ, పారిశుద్ధ్యం, టిడ్కో గృహాలు, గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతి తదితర అంశాలపై నగరపాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇన్‌చార్జ్ ఎస్ఇ శేషసాయి, ఆర్ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణం కొరకు

## ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- డా. కె.వేణుగోపాల్, సీఈఓ సెట్కూరు






**కర్నూలు పెన్ పవర్ అక్టోబర్ 29 :** జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్కూరు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బి.క్యాంపు, కర్నూలు నందు మత్తుపదార్థాలు వ్యసనం – పర్యవసానాలు, సైబర్ క్రైమ్ అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సెట్కూరు సీఈఓ డా.కె.వేణుగోపాల్ గారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాల పై యువత, విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని, మత్తు పదార్థాలకు అలవాటు పడితే విలువైన జీవితం కోల్పోవాల్సి వస్తుందన్నారు, మన సమాజం ఎదుర్కొంటున్న కీలక సమస్యలలో మాదక ద్రవ్యాల వాడకం ఒకటని, పెరుగుతున్న ఆధునిక జీవన శైలి, ఒత్తిడితో చాలా మంది యువత డ్రగ్స్ వాడకానికి బానిసలవుతున్నారని తెలియ చేశారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువత మరియు సమాజం మీద పడుతున్న దుష్ఫలితాలను వివరించారు. యువత డ్రగ్స్ అమ్ముతున్న విషయం తమ దృష్టికి వస్తే వెంటనే సమాచారాన్ని పోలీసులకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలని, డ్రగ్స్, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని,మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణం కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ శ్రీమతి పి సరళా దేవి గారు మాట్లాడుతూ, యువత చదువుకునే వయసులో చదువు పై మాత్రమే మనసు లగ్నం చేయాలనీ, విరామ సమయంలో క్రీడలలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని, ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, మిత్రుల తో సమయం గడపాలని, చదు స్నేహాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు పర్యవేక్షకులు శ్రీ శ్యాం బాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





**అనంతపురం, పెన్ పవర్ అక్టోబర్ 29 :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల పరిరక్షణ / అత్యాచారం నిరోధక చట్టం జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, అర్బన్ దగ్గుపాటి ప్రసాద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి నిజమైన బాధితులకు న్యాయం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు స్మశాన వాటికలను ఏర్పాటు చేసేందుకోసం సర్వే చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి ఎన్ని ఎఫ్ఐఆర్ లు అయ్యాయి, ఎన్ని ఛార్జ్ షీట్లు దాఖలు చేశారు, ఎన్ని ట్రైల్ లో ఉన్నాయి అనే వివరాలు పూర్తిస్థాయిలో తెలపాలన్నారు. పీజీఆర్ఎస్ కి వస్తున్న ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఉద్యోగాల నియామకాల్లో ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా చట్టం ప్రకారం అమలు చేయాలన్నారు. జిల్లా విజిలెన్స్%ౘ% మానిటరింగ్ కమిటీ సమావేశంలో దృష్టికి వచ్చిన సమస్యలకు సంబంధించి పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు సూచించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. 2019 నుంచి 24 వరకు నమోదైన కేసుల్లో ఛార్జ్ షీటు తొందరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటుకు కృషి : ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు లేవనెత్తుతున్న సమస్యలను జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారని, ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ లో ఎక్కడైనా ఆర్ఓ ప్లాంట్లు అవసరమైతే వాటిని ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కళ్యాణదుర్గం హాస్టల్లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని, హాస్టల్స్ లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, స్వచ్ఛంద్ర కింద అదనపు టాయిలెట్స్ ఏర్పాటుకు కృషి చేస్తామని, దాతల ద్వారా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు సమకూరుస్తామన్నారు. ఎక్కడ లా అండ్ ఆర్డర్ సమస్య లేకుండా జిల్లా ఎస్పీ పనిచేస్తున్నారని, జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తాము భాగస్వామ్యం అవుతామన్నారు.

శానిటేషన్ పై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది : అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

నగరంలో శానిటేషన్ వ్యవస్థ గతం కంటే మెరుగుపడిందని.. దీనిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. గత ఐదేళ్లలో టిడ్కో ఇళ్ల నిర్మాణం సాగలేదన్నారు. గతంలో షాపూర్ జీ-పల్లం జీ 192 ఇళ్ల నిర్మాణం చేపట్టగా.. 30 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మ్యాక్స్ సంస్థ 2,112 ఇళ్ల నిర్మాణం చేపట్టగా 80 శాతం వరకు పూర్తయ్యాయన్నారు. రెండు వారాల్లో ఈ పనులు పునఃప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. సబ్ స్టేషన్ కూడా దాదాపు పూర్తైందన్నారు. మార్చి 31నాటికి 2,300 ఇళ్లు పూర్తయ్యేలా చూస్తామన్నారు. పారిశుద్ధ్యం గురించి కౌన్సిల్ సమావేశంలో కూడా చర్చించామని, మంగళవారం ఉదయం తాను కూడా స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేసినట్టు వివరించారు. ప్రస్తుతం డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్లు ఉండటం, ప్రభుత్వం మారిందన్న ఉద్దేశ్యంతో వీటిపై పర్యవేక్షణ లేదన్నారు. దీనిపై అధికారులతో సమావేశం నిర్వహించి.. నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పామన్నారు. బదిలీపై వచ్చిన కార్మికులు సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని.. క్షేత్రస్థాయిలో పని చేయడం లేదన్నారు. దీనిపై ఇక నుంచి పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎన్టీఆర్ మార్గ్ తో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఉందని.. దీని గురించి ఎస్పీతో మాట్లాడి.. తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ఈ సందర్భంగా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు దాస్, యల్లన్న, సాకే చిరంజీవి, ఇమామ్ వలీ, శివకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి కోర్టులో రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ని నియమించాలని, పిజిఆర్ఎస్ కు వచ్చిన వారిని తిప్పుకోకుండా సమస్యలు పరిష్కరించాలని, స్మశాన వాటికలు లేని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని, వాటికి దారులను ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ అభివృద్ధికి సిఎస్ఆర్ ఫండ్స్ లో నిధులు కేటాయించాలని, నగరంలో ఎన్టీఆర్ మార్గంలో శానిటేషన్ ఇబ్బందిగా మారిందని, కనేకల్ ఎస్సీ కాలనీలో స్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలని, నగరపాలక సంస్థలో ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లను ఇవ్వాలని, సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని, బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలను అందజేయడం పట్ల జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, సోషల్ వెల్ఫేర్ జెడి ఖుష్బూ కొఠారి, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, తాడిపత్రి ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి, డిఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవికృష్ణ, శ్రీనివాస్, మహబూబ్ బాషా, డివిఈఓ వెంకటరమణ నాయక్, జడ్పీ సీఈవో శివశంకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డిఎంహెచ్ఓ ఈబి.దేవి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ వసంతలత, విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో పుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ









తిరుమల పెన్ పవర్ అక్టోబర్ 29 : తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం జరగనున్న పుష్పయాగానికి బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా ఉదయం శ్రీవారి ఆలయంలో మూలవిరాట్ ఎదురుగా ఆచార్య ఋత్విక్‌వరణం నిర్వహించారు.

అర్చకులకు విధుల కేటాయింపునే ఋత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు విధులు పొందినట్టు అర్చకులు భావిస్తారు. రాత్రి 7 గంటలకు శ్రీవారి సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారిని ఆలయం నుండి వసంత మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు.

రాత్రి 8 నుండి 9గంటల నడుమ ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ కార్యక్రమం నిర్వహిం చారు. అంకురార్పణం కారణంగా సహస్రదీపాలంకార సేవను టిటిడి రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**అక్టోబర్ 30న పుష్పయాగం :** శ్రీవారి ఆలయంలో గురువారం పుష్పయాగం సందర్భంగా ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవర్లను సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపానికి వేంచేపు చేసి స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు.

మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ కారణంగా ఆర్జితసేవలైన తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాన్ని టిటిడి రద్దు చేసింది.

## ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మసాక్షితో విధులు నిర్వహించాలి


**అవినీతి నిరోధక అవగాహన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ**




**కర్నూలు ,పెన్ పవర్ అక్టోబర్ 29 :** ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మసాక్షితో విధులు నిర్వహించాలని , అత్యాశకు పోయి అవినీతికి పాల్పడరాదని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ ప్రభుత్వ ఉద్యోగులను కోరారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్-2025 కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ పాల్గొని సబికులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... ఈనెల 31 వ తారీఖున స్వర్గీయ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన సందర్భంగా రాష్ట్రంలో అవినీతి నివారణ పై ప్రజలకు , ఉద్యోగస్తులకు అవగాహన కార్యక్రమం అక్టోబర్ 29 నుండి నవంబర్ 2 వరకు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎంతో కష్టపడి చదివి లక్షల మందితో పోటీపడి పరీక్షలు రాసి సాధించిన ఉద్యోగాన్ని ప్రజల అభివృద్ధి కోసం చేయాలని, మనకున్న ఈ ఉన్నతమైన స్థానాన్ని నిలబెట్టుకోవాలని ఆ విధంగా ప్రజలకు సేవ చేసే అవకాశం మనకు మాత్రమే ఉన్నదని తెలిపారు. ప్రజలు కట్టే పన్నుల నుండి మనకు ప్రతినెల జీతాలు వస్తున్నవని అది గుర్తుపెట్టుకుని ప్రజలకు సేవ చేయాలని అంతేకానీ ప్రజలకు చేయవలసిన పనుల కొరకు అవినీతికి పాల్పడి వారి నుండి పైకం ఆశించరాదని డిఆర్ఓ తెలియజేశారు. ప్రస్తుతం అధికారులు సరిగా పని చేయని చో రాష్ట్ర ప్రభుత్వం ఐ వి ఆర్ ఎస్ ద్వారా విషయాలు ప్రజల నుంచి సేకరించుకొని తగిన చర్యలు తీసుకుంటూ ఉందని, కావున ఉద్యోగులు సి సి ఏ రూల్స్ కు అనుగుణంగా ప్రజలకు , ప్రభుత్వానికి సేవలు అందించాలని తెలిపారు. ఈమధ్య ఉద్యోగస్తులకు కొందరి ఫేక్ ఫోన్ కాల్స్ మరియు డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్ కాల్స్ వస్తూ ఉన్నవని వాటికి భయపడకుండా తమ ఉద్యోగ ధర్మాన్ని పాటించాలని , నిజాయితీతో పని చేయాలని కోరారు.ప్రభుత్వ ఉద్యోగి తన వద్ద నిబంధనల మేరకు వేయి రూపాయల కంటే ఎక్కువ నగదు ఉంచుకోరాదని తెలియజేశారు. ఆరోగ్యంగా ఉండటమే మంచి సంపదని అది గుర్తుంచుకొని ఉన్నదానితోనే సంతోషంతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమాలు 2000 సంవత్సరం నుండి జరుగుతూ ఉన్నవని తెలిపారు. లంచం ఇవ్వడం తీసుకోవడం రెండు నేరమేనని ,ఆ విధంగా చేసిన వారిపై కేసులు ఉంటాయని , కేసు రుజువైతే తీసుకున్న వారు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని , సమాజంలో అట్టడుగు స్థాయికి వెళ్లే అవకాశం ఉంటుందని , అవమానాల పాలు కావలసి ఉంటుందని , కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని ,మనశ్శాంతి కోల్పోతారని అన్ని రకాలుగా కష్టాలు, నష్టాలు అనుభవించవలసి ఉంటుందని తెలిపారు. ఉద్యోగి తన వద్ద వెయ్యి రూపాయల కంటే ఎక్కువ నగదు ఉంచుకోరాదని అంతకుమించి ఉన్నట్లయితే అది అవినీతి సొమ్ముగా భావించవలసి ఉంటుందని తెలిపారు.అవినీతి నిరోధక కేసులు ఐదు రకాలుగా ఉంటాయని ట్రాప్ , హౌస్ సర్చ్ , అధిక ఆదాయం , నిధులు దుర్వినియోగం ,అసెట్స్ కేస్ సర్ప్రైజ్ చెక్ మొదలగు విధానాల ద్వారా అవినీతిని అరికట్టే చర్యలు ఉంటాయని తెలిపారు. కావున ఉద్యోగస్తులు నిజాయితీతో ఉద్యోగ ధర్మాన్ని పాటించి ప్రజలకు సేవ చేయాలని కోరారు.

# మనిషి ఎలా ఆలోచిస్తే అలా!??





**పరిసరాలపై ఆలోచనల ప్రభావం**

కడప పెన్ పవర్ అక్టోబర్ 29

మంచిదైనా చెడ్డదైనా,
ఎడతెగని ఒక వ్యక్తి
ఆలోచనా స్రవంతి
ఖచ్చితంగా
అతని శీలంమీద,
పరిస్థితుల మీద
ప్రభావం చూపి తీరుతుంది!

ఒక వ్యక్తి
తన పరిస్థితులను నేరుగా
తనకు కావలసిన విధంగా
ఎంచుకోలేడు!

కానీ, తన ఆలోచనలను మాత్రం
తన ఇష్టంవచ్చినట్లు ఎన్నుకొని,
వాటి ద్వారా తన పరిస్థితులను
ఖచ్చితంగా రూపొందించుకోగలడు!

మనిషి తనకు ఏదైనా జరగాలని
ఎప్పుడూ కోరుకుంటూ,
దాని గురించి ఆలోచిస్తూ ఉన్నప్పుడు
అతను దానిని అందుకునేదానికి
ప్రకృతి అతనికి సహాయం చేస్తుంది!

ఆలోచనలు మంచివైనా, చెడ్డవైనా
అవి నెరవేరేందుకు
కావలసిన అవకాశాలు
త్వరగా కల్పించబడతాయి!


ఒక మనిషి
పాపపు ఆలోచనలు మానిన వెంటనే
ప్రపంచమంతా అతనికి
సహాయం చేయడానికి
సున్నితంగా మారిపోతుంది!

అనారోగ్యమైన, బలహీనమైన
ఆలోచనలను
దూరంగా ఉంచిన వెంటనే
అతను తీసుకున్న
నిర్ణయాలు బలపడేందుకు
అన్ని వైపుల నుండీ
అవకాశాలు పెల్లుబుకుతాయి!

విధి ఎంత బలమైనదైనా
మంచి ఆలోచనలను
ప్రోత్సహించే వ్యక్తిని
పేదరికానికీ, అవమానానికి
అణగదొక్కలేదు!

ఈ ప్రపంచం
నీకు వివిధ రంగులను
వివిధ ఛాయల్లో చూపించే
ఒక కెలిడియోస్కోపులాంటిది!!

అత్యత్భుతమైన
రంగురంగుల
దృశ్యాలుగా మారి,
ప్రతి క్షణం
దాని గుండా కన్పించేవి,
నిజానికి ఎప్పుడూ కదలాడే
నీ ఆలోచనలే!!!



# ఏపీలో కొత్త పొత్తులు

**విజయవాడ, అక్టోబరు 29, పెన్ పవర్:**
ఏపీలో కమ్యూనిస్టులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కడతారా? అందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా? రెండువైపుల నుంచి చర్చలు మొదలయ్యాయా? రెండు వైపులా ఇది ఆవశ్యమా? పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎన్డీఏలో తెలుగుదేశంతో పాటు జనసేన భాగస్వామ్య పక్షాలు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో బిజెపి ఉంది. వైసిపి ఒంటరి పోరాటం చేస్తోంది. జాతీయస్థాయిలో ఇండియా కూటమి లో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో తటస్థ వైఖరి అనుసరిస్తోంది. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి బిజెపి విషయంలో సానుకూలంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో ఒంటరి పోరాటం కంటే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడమే మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సిపిఎం జగన్ విషయంలో సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఉన్న మధు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత. ఆయన అసలు పేరు మధుసూదన్ రెడ్డి గా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి బంధువు అవుతారని కూడా ప్రచారంలో ఉంది. జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉన్న సమయంలో మధు అనారోగ్యానికి గురైతే పరామర్శించారు. అటు తరువాత సిపిఎం అనుబంధ పత్రికకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారీగా ప్రకటనలు కూడా వచ్చాయి. దీంతో గత పదేళ్లుగా జగన్ విషయంలో సిపిఎం పెద్దగా సౌండ్ చేయలేదు. కానీ సిపిఐ మాత్రం గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా గట్టిగానే స్టేట్మెంట్లు ఇచ్చిందిమారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జగన్ పొత్తుల విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఒంటరి పోరాటం చేయడం సాహసమే. అందుకే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడం మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య ఎంపికయ్యారు. దీని వెనుక పొత్తు స్నేహం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. అయితే బిజెపికి జగన్ సానుకూలంగా ఉంటారు. ఇండియా కూటమికి వ్యతిరేకంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. అలాగే చంద్రబాబు పట్ల వామపక్షాలకు ఆ స్థాయిలో వ్యతిరేకతలేదు. కానీ ఇప్పుడు ఏపీలో రాజకీయ ఉనికి చాటుకోక తప్పదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ కంటే ఏపీలో వైసీపీ బలంగా ఉంది. అందుకే ఆ పార్టీతో స్నేహం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి వామపక్షాలు. ఇప్పటివరకు ఒంటరి పోరాటం అన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నినాదం. దమ్ముంటే ఒంటరిగా పోటీకి రండి అంటూ టిడిపి తో పాటు జనసేనకు సవాల్ విసురుతూ వస్తోంది వైసిపి. 2014, 2019 ఎన్నికల్లో ఇదే వామపక్షాలు ఉన్న జగన్ పట్టించుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వామపక్షాల ఉద్యమాన్ని అణచివేశారు జగన్. అడుగడుగునా వారిని అవమానించారు. అటువంటి వామపక్షాలు ఇప్పుడు జగన్తో జతకలుస్తాయి అన్నది అనుమానమే. అయితే ఇప్పుడు పొత్తు ఇరువర్గాలకు అనివార్యం. ఆపై కూటమి ప్రభుత్వం బలంగా ఉంది. అందుకే ఇప్పుడు ఆ రెండు పక్షాలు కలుస్తాయని ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# సొంత జిల్లాపై ఫుల్ ఫోకస్

**తిరుపతి, అక్టోబరు29, పెన్ పవర్:** మ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయాయి. అధికారంలోకి వచ్చి నెలలు గడిచినా, స్థానిక నాయకత్వం కొరవడడం, ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం పార్టీ క్యాడర్‌ను కలవరానికి గురిచేస్తోంది. తంబళ్లపల్లి, తిరుపతి, సత్యవేడు, పుంగనూరు%ॐ% ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఇన్‌ఛార్జ్‌ల పనితీరుపై క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉందట. అధికారం ఉన్నా తమను తాము రక్షించుకోలేని స్థితిలో ఉన్నామంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఈ నేపథ్యంలో జిల్లాలో పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు అధినేత చంద్రబాబు ఏ మేరకు కఠిన నిర్ణయాలు తీసుకుంటారనే దానిపైనే ఉమ్మడి చిత్తూరు భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఇన్‌ఛార్జ్‌ల నియామకం, పనితీరపై అసంతృప్తి:. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో తీవ్రమైన నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఇన్‌ఛార్జ్‌ల నియామకం, వారి పనితీరుపై పార్టీ క్యాడర్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నదట. నాలుగు కీలక నియోజకవర్గాల్లో పరిస్థితి 'చుక్కాని లేని నావ' వలె మారిందట. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం, ఇతర పార్టీల నుంచి అరువు తెచ్చుకున్న నేతలకు కీలక పదవులు ఇవ్వడం, వారు లోకల్ నాయకులను విస్మరించి, తమ సొంత కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడమేనని క్యాడర్ ఆరోపిస్తోంది. శంకర్ యాదవ్, దొరస్వామి నాయుడు ప్రయత్నాలు:. తంబళ్లపల్లి నియోజకవర్గంలో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరి టికెట్ పొందిన జయచంద్రారెడ్డి ఇటీవలే నకిలీ మద్యం వ్యవహారంలో చిక్కుకోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆయన పార్టీలో చేరిన సమయంలోనే స్థానిక క్యాడర్ తీవ్రంగా వ్యతిరేకించినా, కడప జిల్లాకు చెందిన కొందరు నేతల సహకారంతో టికెట్ సంపాదించారట. గత 16 నెలలుగా ఆయన పార్టీ శ్రేణులను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జ్ నియామకం కంటే, సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని స్థానిక క్యాడర్ పట్టుబడుతోందట. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్ రెడ్డి తిరిగి వస్తారని ప్రచారం జరుగుతున్నా, గతంలో ఆయన చంద్రబాబుపై చేసిన విమర్శల కారణంగా టీడీపీ కార్యకర్తలు అంతగా ఇంట్రెస్ట్ చూపట్లేదట. మరోవైపు, శంకర్ యాదవ్, తెలుగు యువత నాయకుడు కట్టా దొరస్వామి నాయుడు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తుండగా, క్యాడర్ మాత్రం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని కోరుకుంటోందట. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్:. తిరుపతి నియోజకవర్గంలో కూడా ఇదే విధమైన నాయకత్వ శూన్యత నెలకొని ఉందట. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నప్పటికీ, ఆమెకు సహకరించే నాయకత్వం లేకపోవడంతో ఆమె ప్రయత్నాలు ఫలించడం లేదు. చాలామంది నాయకులు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నించి, ఆశలు వదులుకుని సైలెంట్ అయ్యారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే ఉండటం, అధిక సంఖ్యలో వైసీపీ నుంచి వచ్చిన కార్పొరేటర్లు జనసేన వైపు మొగ్గు చూపడం పార్టీని బలహీనపరుస్తోంది. దీనికి తోడు, నగర పాలక సంస్థలో అవినీతి, దందాలు పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు, ఫలితంగా టీడీపీ క్యాడర్ తీవ్రమైన మానసిక క్షోభకు లోనవుతోందట. ఈ పరిస్థితుల దృష్ట్యా, క్యాడర్ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోందట. జె.బి. శ్రీనివాస్, మబ్బు నారాయణ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్ లతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తే మూడు బలమైన సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లభించి, పార్టీ బలోపేతం అవుతుందని వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ ఇన్‌ఛార్జ్‌ల నియామకంలో కూడా బలహీనులను పెట్టారనే విమర్శలున్నాయి. సత్యవేడులో కన్వీనర్‌గా శ్రీపతి బాబు తొలగింపు:. సత్యవేడులో పరిస్థితి మరింత విచిత్రంగా ఉంది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి వచ్చి, అందరి వ్యతిరేకత మధ్య విజయం సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తర్వాత జరిగిన పరిణామాలతో ఇరుక్కుపోయారు. ముఖ్యంగా గ్రావెల్ మాఫియా చేసిన కుట్ర, ఓ మహిళా టీడీపీ నాయకురాలితో ఆయన వీడియో బయటకి రావడం వంటి వాటితో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత శ్రీపతి బాబును కన్వీనర్‌గా నియమించినప్పటికీ, అధిష్టానం ఆయన్ను తొలగించి కాంట్రాక్టర్ శంకర్ రెడ్డిని ప్రోగ్రామ్ కన్వీనర్‌గా నియమించింది.. ఆయనే ఇన్‌ఛార్జ్‌గా చెప్పుకుంటున్నారు. శంకర్ రెడ్డి పార్టీలో చేరిన వెంటనే తన సామాజిక వర్గాన్ని మొత్తం పార్టీలోకి చేర్చి, వారికి అన్ని వ్యవహారాలు అప్పగించడంతో స్థానిక టీడీపీ క్యాడర్ తీవ్ర స్థాయిలో అగ్రహం వ్యక్తం చేస్తోంది. తాజాగా, ఓ దేవాలయం ధర్మకర్తల నియామకంలో వివాదస్పద మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శేఖర్ రెడ్డి అనుచరుడికి అవకాశం కల్పించడం, అనేక కేసులు ఉన్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించడం మరింత వివాదాన్ని రేపింది. ఇక్కడ కూడా తంబళ్లపల్లి మాదిరిగానే భవిష్యత్తులో పార్టీకి నష్టం చేకూర్చవచ్చని క్యాడర్ ఆందోళన చెందుతోంది. కోల్డ్ స్టోరేజ్‌లో పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం:. ప్రతిష్టాత్మకమైన పుంగనూరు నియోజకవర్గంలోనూ ఇదే సమస్య తలెత్తింది. ఇన్‌ఛార్జ్ అయిన చల్లా బాబు రెడ్డి చుట్టూ ఉన్న కోటరీతో స్థానిక కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పార్టీ కోసం నష్టపోయిన, జైళ్లకు వెళ్లిన కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోకుండా, ఆయన కోటరీ తమను ఇబ్బంది పెడుతోందని, ముఖ్యంగా వైసీపీలో తమపై దాడులు చేసిన వారికి అండగా నిలుస్తోందని ఆరోపణలు వచ్చాయి. గతంలో రామకృష్ణ అనే టీడీపీ కార్యకర్త హత్యను కూడా దీనికి నిదర్శనంగా చూపుతున్నారు. అధికారం చేతికి వచ్చినా, కార్యకర్తలు తమ అధికార దర్పం చూపించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని తెలుస్తోంది. పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం కూడా కోల్డ్ స్టోరేజ్‌లో ఉండిపోయింది. మొత్తం మీద, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి మంత్రి ప్రాతినిధ్యం లేకపోవడం, సీనియర్ నాయకులు పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం వంటి పరిస్థితుల్లో, కొత్త ఇన్‌ఛార్జ్‌లు, అధ్యక్షుల నియామకం తర్వాత అయినా తమను పట్టించుకునే వారు ఉంటారని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు

# ఏపీలో ఆల్ ఇన్ వన్ యాప్

**ఒంగోలు, అక్టోబరు 29, పెన్ పవర్:** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా బిల్లు చెల్లింపులు, కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవడం సులభం కానుంది. అంతేకాకుండా.. ఇంట్లో ఉండే ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఎంత కరెంటు ఉపయోగిస్తున్నాయో ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులతో నేరుగా సంప్రదించే అవకాశం ఈ యాప్ ద్వారా కల్పించారు. కాగా ఇటీవల, విద్యుత్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ అధికారులను హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త సాంకేతికతను ఉపయోగిస్తోంది. వినియోగదారుల సమస్యలను మరింత వేగంగా, సమర్థంగా పరిష్కరించడానికి ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో ప్రత్యేక ఫీచర్లు అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో.. ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలిస్తారు. అనంతరం వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తారుయాప్ ద్వారా విద్యుత్ బిల్లులు సులభంగా చెల్లించొచ్చు. బిల్‌పే అనే ఆప్షన్ ద్వారా సర్వీసు నంబరు, మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే.. వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు ప్రత్యక్షమవుతాయి. అనంతరం పేమెంట్ చేయాల్సి ఉంటుంది. ఇక కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం అప్లికేషన్ కూడా చేసుకోవచ్చు. అందుకోసం అన్ని వివరాలను యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తును అధికారులు పరిశీలించి కొత్త కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు. కాగా, ఇంట్లో ఏయే ఎలక్ట్రానిక్ పరికరాలు ఎంత విద్యుత్తు వినియోగిస్తున్నాయో.. ఈ యాప్‌లో ఉన్న ఎనర్జీ కాలిక్యులేటర్ ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు మీటరు రీడింగ్ వివరాలు ఎంటర్ చేస్తే.. ఆ సమాచారం కనిపిస్తుంది. అంతేకాకుండా, కరెంట్ ఆదా చేయడానికి కూడా ఈ యాప్‌లో సలహాలు, సూచనలు ఉంటాయి. విద్యుత్ అధికారుతో కూడా నేరుగా మాట్లాడి సమస్యలు తెలిపే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది. సూపర్ యాప్ ద్వారా కస్టమర్ సేవలు కూడా అందిస్తోంది ఏపీఎస్పీడీసీఎల్. వినియోగదారులు తమ సమస్యలను ఈ యాప్‌లో పొందుపరచొచ్చు. విద్యుత్తు శాఖ అందిస్తున్న సేవలపై ఫీడ్‌బ్యాక్ కూడా ఇవ్వొచ్చు. సంతృప్తి లేదా అసంతృప్తి తెలియజేయొచ్చు. వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు ఈ యాప్‌లో ఉంటాయి. వారికి ఫోన్ చేసి సందేహాలు అడిగి తెలుసుకోవచ్చు. అంతేకాకుండా వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు కూడా యాప్‌లో ఉంటాయి. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలను అందించాలని ఇటీవల ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అక్టోబర్ 22న ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 9 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో నిర్వహించారు. వినియోగదారుల మన్ననలు పొందేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సంస్థ పరిధిలోని 410 సెక్షన్లలో వినియోగదారులకు అందుబాటులో ఉంటూ నిరంతర విద్యుత్ సరఫరా, లో ఓల్టేజ్ సమస్య లేకుండా చేయడానికి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని శివ శంకర్ వార్నింగ్ ఇచ్చారు.

# పొగాకు వద్దంటే వినరే...

**గుంటూరు, అక్టోబరు 29,పెన్ పవర్:**
ప్రభుత్వం వద్దన్నా రైతులు బర్లీ పొగాకు సాగును ఆపడం లేదు. ఖరీఫ్ లో 21 వేల ఎకరాల్లో సాగు చేయగా, అందులో 15 వేల ఎకరాలు బర్లీ పొగాకే. కొనుగోలుదారుల స్పష్టత లేక, ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టినా, సమస్య తీరడం లేదు. రబీలోనూ సాగు పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం వద్దని చెప్పినా రైతులు వినడం లేదు.. నిషేధించినా సరే వెనక్కు తగ్గడం లేదు. రాష్ట్రంలో రైతులు బర్లీ పొగాకు సాగు ఆగడం లేదు. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 21 వేల ఎకరాల్లో రైతులు ఈ బర్లీ పొగాకు వేశారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 11,400 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 4,600 ఎకరాల్లో, కర్నూలు జిల్లాలో 4,000 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. మొత్తం 21 వేల ఎకరాల్లో, 15 వేల ఎకరాలు బర్లీ పొగాకే. ఎఫ్‌సీవీ (ఫుల్ క్యూర్డ్ వర్జీనియా పొగాకు) రకం కేవలం 6 వేల ఎకరాల్లోనే సాగైంది.. ఏడు జిల్లాల్లో కొద్ది విస్తీర్ణంలో సాగు చేశారు. మొత్తం 21 వేల ఎకరాల్లో.. 6 వేల ఎకరాలు ఫుల్ క్యూర్డ్ వర్జీనియా పొగాకు (ఎఫ్‌సీవీ) రకం కాగా.. మిగిలిన 15 వేల ఎకరాలు బర్లీ పొగాకు. ఈ పొగాకును ఎవరు కొనుగోలు చేస్తారు.. ఎంత ధరకు కొనుగోలు చేస్తారో కూడా క్లారిటీ లేదు. చాలామంది రైతులు మరే పంట వేయాలో తెలియక చాలామంది పొగాకు సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే.. రబీ సీజన్‌లో కూడా బర్లీ పొగాకు సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. అప్పుడు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గతేడాది క్వింటాలుకు రూ.15 వేలు పలికిన బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ పొగాకు ధరలు ఈ ఏడాది గణనీయంగా పడిపోయాయి. వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల



కష్టాలను గుర్తించిన ప్రభుత్వం, వారిని ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. మార్క్‌ఫెడ్ ద్వారా 19.73 మిలియన్ కిలోల బ్లాక్ బర్లీని కొనుగోలు చేసింది. క్వింటాలుకు రూ.12 వేలు ధర నిర్ణయించినా, చాలా మంది రైతులకు ఆ ధర కూడా దక్కలేదు. కొనుగోలు ప్రక్రియలో ధరలో కోత పడిందని రైతులు చెబుతున్నారు. ప్రైవేట్ వ్యాపారుల ద్వారా మరో 50 మిలియన్ (5 కోట్ల) కిలోల పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ, ఇంకా చాలా మంది రైతుల ఇళ్లలో పొగాకు అమ్ముడుపోకుండానే మిగిలిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైట్ బర్లీ సాగు చేసిన రైతులు కూడా ఈ ఏడాది నష్టాలనే ఎదుర్కొన్నారు. గత ఏడాది క్వింటాలుకు రూ.15 వేలు లభించిన ధర, ఈ ఏడాది రూ.12 వేల నుంచి అతికష్టం మీద మాత్రమే రూ.15 వేలకు చేరింది. అంటే ధరలో పెద్దగా పెరుగుదల లేదని, కొందరు రైతులు రూ.12 వేలకే అమ్ముకోవాల్సి వచ్చిందని చెబుతున్నారు. కర్నూలు, నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వైట్ బర్లీ పొగాకు సాగు ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలలోని రైతులు ఈ ధరల పతనంతో తీవ్రంగా నష్టపోయారు. వ్యాపారులు ముందుకు రాకపోవడం, ప్రభుత్వ కొనుగోళ్లు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఏపీ ప్రభుత్వం హెచ్‌డీ బీఆర్‌జీ, హెచ్‌డీ బర్లీ, బ్లాక్ బర్లీ వంటి పొగాకు రకాల సాగును నియంత్రించింది. ఈ నియంత్రణలో భాగంగా, జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్ల నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశారు.

# గ్రేటర్ సిటీగా తిరుపతి

**తిరుపతి, అక్టోబరు 29, పెన్ పవర్:**
తిరుపతి ఇక గ్రేటర్ సిటీగా మారనుంది! 30 చ.కి.మీ నుంచి 284 చ.కి.మీకి విస్తరించనున్న నగరం, 4.5 లక్షల నుంచి 7.5 లక్షలకు పెరగనున్న జనాభా. గ్రామీణ, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని 63 గ్రామ పంచాయతీలు విలీనం కానున్నాయి. సీఎం ఆదేశాలతో ఈ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదం కోసం సిద్ధమయ్యాయి. తిరుపతి రూపురేఖలు మారనున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఆమోదం రాగానే తిరుపతి గ్రేటర్ సిటీగా మారనుంది. ఆంధ్రప్రదేశ్‌లో మరో నగరం గ్రేటర్ సిటీగా మారుతోంది. గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలకు తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తిరుపతి నగరం విస్తీర్ణం 30.17 చ.కి.మీ నుంచి 283.80 చ.కి.మీకి పెరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు.. తిరుపతి మహా నగరపాలికలో తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని 63 గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని జిల్లా యంత్రాంగం ఈ ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు తిరుపతి గ్రేటర్ తీర్మానాన్ని ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతున్నట్లు మేయర్ డాక్టర్ శిరీష ప్రకటించారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో, కమిషనర్ ఎన్.మౌర్య 108 అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం లభించింది. ఈ విస్తరణతో తిరుపతి నగరం విస్తరించనుంది.







ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల తిరుపతి పర్యటనలో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఈ విస్తరణ అవసరమని సూచించారు. ఈ సూచనల మేరకు జిల్లా యంత్రాంగం గ్రామ పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదనలను రూపొందించింది. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదం పొందిన తర్వాత గ్రేటర్ తిరుపతి ఏర్పడనుంది. గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు తాత్కాలికంగా వాయిదా వేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేల అభిప్రాయాలు తెలుసుకుని, మరిన్ని పంచాయతీలను విలీనం చేయాలని కోరారు. అయితే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు దీనికి అంగీకరించలేదు.. వారు వెంటనే ఓటింగ్‌కు డిమాండ్ చేశారు. మేయర్ శిరీష కో ఆప్షన్ సభ్యులు, ఎంపీ, ఎమ్మెల్సీల అభిప్రాయాలను సేకరించారు. ఎక్కువమంది సభ్యులు గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనకు మద్దతు ఇవ్వడంతో మెజారిటీ సభ్యుల ఆమోదంతో గ్రేటర్ ప్రతిపాదనలను ఆమోదించినట్లు మేయర్ శిరీష ప్రకటించారు. తిరుపతి నగరం గ్రేటర్‌గా మారనుంది. ప్రస్తుతం 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న తిరుపతి, గ్రేటర్‌గా మారితే 284 చదరపు కిలోమీటర్లకు విస్తరిస్తుంది. జనాభా కూడా 4.50 లక్షల నుండి 7.50 లక్షలకు పెరుగుతుంది. వార్షిక ఆదాయం రూ.149 కోట్ల నుండి రూ.182 కోట్లకు చేరుకుంటుంది. చంద్రగిరి, రేణిగుంట వంటి పెద్ద పంచాయతీలు తిరుపతిలో కలిసిపోతాయి. నగరం విమానాశ్రయం దాటి, వికృతమాల వరకు విస్తరించనుంది. ఈ విస్తరణతో తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ఈ మార్పులతో తిరుపతి రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. అయితే గ్రేటర్ తిరుపతి ఏర్పాటు విషయంలో భౌగోళికంగా ప్రజలకు గానీ, అధికార యంత్రాంగానికి గానీ అసౌకర్యం కలగని రీతిలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆ మేరకే గ్రేటర్ తిరుపతికి ప్రతిపాదనలు పంపారు.

# టీ20ల్లో సూర్యకుమార్ యాదవ్ అరుదైన రికార్డు

- టీ20ల్లో 150 సిక్సర్లు పూర్తి చేసిన సూర్యకుమార్ యాదవ్
- ఈ ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్‌గా గుర్తింపు
- ప్రపంచంలో రెండో వేగవంతమైన ఆటగాడిగా రికార్డు
- 205 సిక్సర్లతో రోహిత్ శర్మ అగ్రస్థానంలో
- వర్షం కారణంగా రద్దయిన భారత్-ఆస్ట్రేలియా తొలి టీ20




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 జట్టు కెప్టెన్, విధ్వంసకర బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ తన కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్‌లో 150 సిక్సర్లు బాదిన రెండో భారత క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియాతో బుధవారం కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్ స్టేడియంలో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో సూర్య ఈ ఘనతను సాధించాడు. ఈ జాబితాలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ (205) అగ్రస్థానంలో ఉన్నాడు.
ఈ మ్యాచ్‌లో తన రెండో సిక్సర్ బాదిన వెంటనే సూర్యకుమార్ 150 సిక్సర్ల క్లబ్‌లో చేరాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఫీట్ సాధించిన ఐదో బ్యాటర్ అతడే కావడం విశేషం. కేవలం 86 ఇన్నింగ్స్‌ల్లోనే సూర్య ఈ మైలురాయిని చేరుకొని, అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా నిలిచాడు. యూఏఈకి చెందిన మహమ్మద్ వసీం (66 ఇన్నింగ్స్‌లు) మాత్రమే అతని కంటే ముందున్నాడు. న్యూజిలాండ్ మాజీ ఆటగాడు మార్టిన్ గప్టిల్ (101 ఇన్నింగ్స్‌లు) మూడో స్థానంలో ఉన్నాడు.ఇప్పటివరకు 91 టీ20 మ్యాచ్‌లు ఆడిన సూర్య.. 165కి పైగా స్ట్రైక్ రేట్‌తో, 37 సగటుతో 2,650కి పైగా పరుగులు సాధించాడు. అతని ఖాతాలో 4 సెంచరీలు, 21 అర్ధ సెంచరీలు ఉన్నాయి. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, భారత గడ్డపై... ఇలా నాలుగు వేర్వేరు దేశాల్లో టీ20 శతకాలు బాదిన ఏకైక ఆటగాడిగా సూర్యకుమార్ అరుదైన రికార్డును కలిగి ఉన్నాడు.
ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ వికెట్ త్వరగా కోల్పోయిన తర్వాత సూర్య (39ి), శుభ్‌మన్ గిల్ (37ి) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. భారత్ 9.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 97 పరుగులు చేసిన దశలో వర్షం అడ్డుపడింది. మొదట మ్యాచ్‌ను 18 ఓవర్లకు కుదించినప్పటికీ, వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

# ఇది అన్యాయమే బాస్: అర్షదీప్ కాకుండా హర్షిత్‌కు ఛాన్స్.. గంభీర్‌పై నెటిజన్స్ విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టీ20లో ఇండియా ప్లేయింగ్ 11 ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆస్ట్రేలియా లాంటి బౌన్సీ వికెట్ ఉన్న పిచ్ పై ఇద్దరు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో మన జట్టు బరిలోకి దిగింది. మిస్టర్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తితో పాటు లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ కుల్దీప్ కు చోటు దక్కింది. మరో స్పిన్నర్ అక్షర్ పటేల్ కూడా జట్టులో ఉన్నాడు. ఆడుతుంది ఆస్ట్రేలియాలో అయినా భారత జట్టు మాత్రం ముగ్గురు స్పిన్నర్లను కొనసాగించడం చర్చనీయాంశంగా మారుతోంది. ఆసియా కప్ లో ఉపఖండపు పిచ్ లు కావడంతో ముగ్గురు స్పిన్నర్లలను ఆడించడంలో అర్థం ఉంది. కానీ ఫాస్ట్ బౌలింగ్ కు అనుకూలించే ఆసీస్ గడ్డపై ముగ్గురు స్పిన్నర్లు అవసరం లేదు. ముగ్గురు స్పిన్నర్ల వ్యూహాన్ని పక్కన పెడితే అంతకంటే షాకింగ్ న్యూస్ మరొకటి ఉంది. అదేంటో కాదు ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ కు తుది జట్టులో స్థానం ఇవ్వకుండా హర్షిత్ రానాకు చోటు కల్పించారు. ఈ నిర్ణయం చాలామంది క్రికెట్ ఫ్యాన్స్ కు షాక్ ఇచ్చింది. అర్షదీప్ టీ20ల్లో అరంగేట్రం చేసినప్పటి నుంచి నిలకడగా రాణించడంతో పాటు ఇండియా తరపున పొట్టి ఫార్మాట్ లో టాప్ వికెట్ టేకర్. మరోవైపు హర్షిత్ రానాకు పెద్దగా అంతర్జాతీయ అనుభవం లేదు. అయినప్పటికీ అర్షదీప్ ను పక్కనపెట్టి హర్షిత్ కు ఛాన్స్ ఇవ్వడంతో నెటిజన్స్ టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ పై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. గంభీర్ కారణంగానే హర్షిత్ రానా జట్టులో కొనసాగుతున్నాడని ఫైరవుతున్నారు. అర్షదీప్ సింగ్ కు బ్యాటింగ్ నేర్చుకోవాలని కొంతమంది సలహాలు ఇస్తున్నారు. టాప్ వికెట్ టేకర్ కు జట్టులో ప్లేస్ లేకపోవడం విచారకరం అని కామెంట్స్ చేస్తున్నారు. ఈ మ్యాచ్ లో హర్షిత్ రానా రాణించకపోతే గంభీర్ ను ట్రోల్ చేయడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న మ్యాచ్ విషయానికి వస్తే టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేస్తున్న ఇండియా ప్రస్తుతం 9.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోయింది. వర్షం కారణంగా మ్యాచ్ ను 18 ఓవర్లకు కుదించారు. క్రీజ్ లో గిల్ (37), సూర్య కుమార్ యాదవ్ (39) ఉన్నారు. అభిషేక్ శర్మ (19) విఫలమయ్యాడు.

# సెమీ ఫైనల్ పోరు.. టాస్ గెలిచిన ఇంగ్లాండ్.. సౌతాఫ్రికా బ్యాటింగ్






**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వరల్డ్ కప్ లో భాగంగా బుధవారం (అక్టోబర్ 29) ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్ల మధ్య తొలి సెమీస్ ప్రారంభమైంది. గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో ఇంగ్లాండ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఈ కీలకమైన సెమీస్ లో సౌతాఫ్రికా ఒక మార్పుతో బరిలోకి దిగుతుంది. మసాబాటా క్లాస్ స్థానంలో ప్లేయింగ్ 11 లోకి అన్నేకే బాష్ వచ్చింది. మరోవైపు ఇంగ్లాండ్ ప్లేయింగ్ 11లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఆదివారం (నవంబర్ 2) ఆస్ట్రేలియా లేదా ఇండియాతో ఫైనల్ మ్యాచ్ ఆడుతుంది. ఇంగ్లండ్ ఇప్పటికే నాలుగుసార్లు విజేతగా నిలిచి ఐదో ట్రోఫీపై గురి పెట్టగా.. తొలిసారి సెమీస్ చేరిన సఫారీ టీమ్ ఫైనల్ చేరాలని భావిస్తోంది. స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తమ బలహీనతను సరిదిద్దుకొని ఇంగ్లిష్ టీమ్ పని పట్టాలని ఆశిస్తోంది. నాకౌట్ దశకు చేరుకునే క్రమంలో సౌతాఫ్రికా రెండు భారీ ఓటములను చవిచూసింది. ఈ రెండు సందర్భాల్లోనూ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఆ టీమ్ బ్యాటింగ్ తడబడింది. తమ తొలి మ్యాచ్‌లో 69 రన్స్‌కే ఆలౌటైన సఫారీలు.. ఆ తర్వాత న్యూజిలాండ్, ఇండియాపై గెలిచినా, లీగ్ దశలో ఆస్ట్రేలియాపై 97 రన్స్ కే కుప్పకూలడం ఆ టీమ్ స్పిన్ వీక్‌నెస్‌ను మరోసారి స్పష్టం చేసింది. ఈ బలహీనతను మరోసారి సొమ్ము చేసుకోవాలని ఇంగ్లండ్ పట్టుదలతో ఉంది. ఆ జట్టు స్పిన్ త్రయం సోఫీ ఎకిల్‌స్టోన్, లిన్సీ స్మిత్, చార్లీ డీన్ సఫారీ బ్యాటర్లను కట్టడి చేయాలని చూస్తున్నారు. అయితే, తమ చివరి మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ భుజానికి గాయమైన ఎకిల్‌స్టోన్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు, సౌతాఫ్రికా తరఫున కెప్టెన్ లారా వోల్వార్ట్ ఏడు మ్యాచ్‌ల్లో 50.16 సగటుతో 301 రన్స్ చేసి టీమ్‌ను ముందుండి నడిపించింది. అయితే, ఆమె మినహా తజ్మిన్ బ్రిట్స్, సునే లూస్, మరిజేన్ కాప్ వంటి కీలక బ్యాటర్లు నిలకడగా రాణించకపోవడం జట్టును ఆందోళనకు గురిచేస్తోంది.

# ఎనర్జిటిక్ స్టార్ తో 'ఓజీ' భామా?







చెన్నై బ్యూటీ ప్రియాంక అరుల్ మోహన్ పరిచయం అసవరం లేని పేరు. నాని హీరోగా నటించిన %-%గ్యాంగ్ లీడర్%-% తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అటుపై %-%సరిపోదా శనివారం%-% తో మరో హిట్ ఖాతాలో వేసుకుంది. ఇటీవల రిలీజ్ అయిన %-%ఓజీ%-% లో భాగమైంది. ఈ సినిమా విజయంతోనూ ప్రియాంక పేరు వైరల్ గా మారింది. అయితే టాలీవుడ్ లో అమ్మడి కెరీర్ మాత్రం ఇంకా ఊపందుకోలేదు. కెరీర్ ప్రారంభమై ఐదేళ్లు అవుతున్నా? వేగం పుంజుకోలేదు. అందం ..అభినయం అన్ని ఉన్నా? అవకాశాలు అందుకోవడంలో వెనుకబడుతోంది. మరి ఈ వెనుక బాటుకు కారణం ఏంటి? అన్నది సస్పెన్స్.

**కెరీర్ ఇంకా స్లోగానే:**

అమ్మడు గ్లామర్ ఎలివేషన్లకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వదు. వీలైనంత వరకూ నటనకు ఆస్కారం ఉన్న పాత్రలవైపే అడుగులు వేస్తుంది. మరి ఇలా ఇంకెంత కాలం నెట్టుకొస్తుందో చూడాలి. ప్రస్తుతం తమిళ్ లో %-%కెవిన్%-% అనే ఓ సినిమా చేస్తోంది. ఈ సినిమా మినహా కొత్త ఛాన్సులేవి లేవు. అయితే తాజాగా ఎనర్జిటిక్ స్టార్ రామ్ అప్ కమింగ్ ప్రాజెక్టో ఛాన్స్ అందుకుందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం రామ్ హీరోగా మహేష్ దర్శకత్వంలో %-%ఆంధ్రా కింగ్ తాలూకా%-% అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. అన్ని పనులు పూర్తి చేసుకుని నవంబర్ లో ఈ చిత్రం రిలీజ్ రానుంది.

**ఎవరికైనా సరైన రోల్:**

అటుపై రామ్.. కిషోర్ గోపు అనే కొత్త కుర్రాడితో ఓ సినిమా చేయనున్నాడు. ఇప్పటికే స్టోరీ లాక్ అయింది. ప్రస్తుతం గోపీ ఆ సినిమాకు సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నాడు. ఇందులో హీరోయిన్ గా ప్రియాంక పేరు పరిశీలనలో ఉందని సమాచారం. రామ్ ఇమేజ్ కు తగ్గ హీరోయిన్లను కొంత మందిని పరిశీలించగా అందులో ప్రియాంక కూడా ఉందని తెలిసింది. ఇది లవ్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్. సినిమాలో హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యత ఉందిట. హీరోకి ధీటుగా హీరోయిన్ పాత్ర ఉంటుందంటున్నారు. ఈనేపథ్యంలో రామ్ సరసన ఏ నాయిక ఎంపికైనా మంచి పాత్ర పడ్డట్లే.

**నాని అందుకే రిపీట్ చేసాడు:**

ప్రియాంక మోహన్ మంచి పెర్ఫార్మర్ అని తొలి సినిమాతోనే నిరూపించింది. అటుపై శర్వానంద్ కు జోడీగా న టించిన %-%శ్రీకారం%-% లోనూ అలరించింది. అందులోనూ నటనకు ఆస్కారం ఉన్న పాత్రలోనే కనిపించింది. తనలో ఆస్కిల్స్ చూసే నాని మళ్లీ %-%సరిపోదా శనివారం%-%లో హీరోయిన్ ఛాన్స్ ఇచ్చాడు. మరి ఈ బ్యూటీలో స్కిల్స్ ను రామ్ అండ్ కో ఎంత వరకూ వినియోగించుకుంటుందో చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com